శుక్రవారం, హైదరాబాద్
22.03.2.024
సంపుటి:2 సంచిక:160

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## కాంగ్రెస్ థర్డ్‌లిస్ట్ రిలీజ్

- ఆయా రాష్ట్రాల్లో 57 మంది అభ్యర్థుల ప్రకటన
- తెలంగాణలో ఐదుగురు క్యాండిడేట్లకు చోటు

**ఢిల్లీ, విశాల భారతి:**

లోక్‌సభ ఎన్నికలకు 57 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ థర్డ్‌లిస్ట్‌చేసింది. ఇందులో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కింది. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, మల్కాజిగిరి సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ దానం నాగేందర్, చేవెళ్ల రంజిత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ మల్లు రవిని అభ్యర్థులుగా ఖరారు చేసింది. అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలోని కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. తెలంగాణకు సంబంధించి ఫస్ట్‌లిస్ట్‌లో నాలుగు

..మిగతా 2 లో

## మోడీ కుట్రతోనే.. బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్

- రూ. 2 కూడా ఖర్చు పెట్టలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ
- పైసలు లేక ఎన్నికల ప్రచారానికి వెళ్లలేక పోతున్నం..
- విమానాలు కాదు.. రైలు టికెట్లు కొనుక్కోలేని దుస్థితి
- కనీసం ఎలక్షన్‌పోస్టర్లు ప్రింట్‌చేయలేకపోతున్నాం..
- లోక్‌సభ ఎన్నికల ప్రచారం అడ్డుకుంటున్న బీజేపీ
- పారదర్శకత కోసం అకౌంట్స్‌అన్‌ఫ్రీజ్‌చేయాలి
- కాంగ్రెస్‌అగ్రనేతలు సోనియా, రాహుల్, ఖర్గే ఫైర్
- కేంద్రం అడ్డంకులను చేదించి గెలుస్తామని ధీమా

“ లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు సీనియర్లు, జూనియర్లు పార్టీని వీడుతున్నారు. ఇక ఇండియా కూటమిలో ఉన్న పార్టీల మధ్య పొత్తులు, సీట్ల పంపకాలు సజావుగా సాగడం లేదు. అటు.. అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రచారంలో దూసుకుపోతుంటే కాంగ్రెస్ మాత్రం.. ఆ మేరకు దూకుడు ప్రదర్శించలేకపోతోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో.. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ‘హస్తం’ పార్టీ పరిస్థితి తయారైంది. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు తమ వద్ద డబ్బులు లేకుండా పోయాయని ఏకంగా సోనియా, రాహుల్, ఖర్గే సహా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు తమ పార్టీ బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసి.. కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తున్నారని కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది.

**విశాల భారతి, నేషనల్‌బ్యూరో:**



లోక్‌సభ ఎన్నికల వేళ.. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను కేంద్రం స్తంభింపజేయడం, ఎన్నికల బాండ్ల అంశంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే.. అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ గురువారం ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే నరేంద్ర మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకే ప్రధాని మోదీ తమ పార్టీ బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేశారని మండిపడ్డారు. ఓ వైపు ఎన్నికలు సమీపిస్తుండగా.. మరోవైపు.. కేంద్రం అకౌంట్లు స్తంభింపజేయడంతో డబ్బులు లేక ప్రచారం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల్లో ప్రచారం చేయడానికి పార్టీ అకౌంట్లలో ఉన్న డబ్బులు చాలా అవసరమని.. ఇప్పుడు కేంద్రం తమ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని అడ్డుకుంటోందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి

..మిగతా 2 లో



## కేజ్రీవాల్ అరెస్ట్

- ఢిల్లీలో హై టెన్షన్.. కేజ్రీవాల్ ఇంటికి ఆప్ నేతలు?
- కార్యకర్తల భారీ ఆందోళన

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయన నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులు.. ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అంతకముందు కేజ్రీవాల్ ఫోన్‌ను సీజ్ చేశారు. 12 మంది అధికారులతో కూడిన ఈడీ బృందం ఆయనకు పదోసారి సమన్లు ఇచ్చేందుకు వెళ్లిన తర్వాత ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కేజ్రీవాల్‌ను దాదాపు రెండు గంటల పాటు విచారించి అదుపులోకి తీసుకున్నారు. తాజా పరిణామాలతో సీఎం ఇంటివద్ద భారీగా పోలీసులు మోహరించడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. సీఎం నివాసానికి ఆప్ నేతలు, పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు తరలివచ్చి ఆందోళన చేస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీలో మనీ లాండరింగ్ జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. దేశ వ్యాప్తంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు సంచలనం రేపింది. ఈ కేసులో ఇదివరకే ఢిల్లీ మంత్రులను ఈడీ అరెస్ట్ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సైతం అరెస్ట్ చేసి విచారణ కొనసాగిస్తోంది. మరోవైపు ఢిల్లీ లిక్కర్ కేసు సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కు ఉచ్చు బిగుసుకుంటోంది. కేజ్రీవాల్ ను ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేసే వాతావరణం కనిపిస్తోంది.

**కేజ్రీవాల్ ఇంటికి ఈడీ అధికారులు**

ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కు ఈడీ 9 సార్లు నోటీసులు ఇచ్చింది. కానీ ఆయన ప్రతిసారి విచారణకు దుమ్మా కొట్టారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ పై గుర్రుగా ఉన్న ఈడీ అధికారులు 8 మంది సెర్చ్ వారెంట్ తో ఆయన ఇంటికి వెళ్లారు. కేజ్రీవాల్ కు 10వ సారి ఈడీ అధికారులు సమన్లు జారీ చేస్తున్నారు. నేటి రాత్రికి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను అరెస్ట్ అవకాశం ఉందని ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ మంత్రులు, ఆప్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కేజ్రీవాల్ నివాసానికి చేరుకుంటున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కి హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఈడీ తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కోరుతూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టుని ఆశ్రయించారు. ఈ విజ్ఞప్తిని కోర్టు గురువారం తోసిపుచ్చింది. ఈడీ అరెస్ట్ నుంచి కేజ్రీవాల్ కు మినహాయింపు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తాము ఈ కేసులో జోక్యం చేసుకోమని స్పష్టం చేసింది. అయితే..ఈ పిటిషన్‌పై స్పందించాలని ఈడీని ఆదేశించింది. ఏప్రిల్ 22వ తేదీన మరోసారి విచారణ జరుపుతామని వెల్లడించింది. కానీ అంతలోనే ఈడీ అధికారులు కేజ్రీవాల్ నివాసానికి చేరుకుని సోదా చేస్తున్నారు.



### కేజ్రీవాలే సీఎంగా ఉంటారు

- ఎక్కడ ఉంచితే అక్కడి నుంచే పాలన
- ఆయన అరెస్ట్ ఓ కుట్ర
- ఢిల్లీ మంత్రి అతిషీ

..మిగతా 2 లో



## ఉదయం 7 గంటలకే బస్తీ బాట పట్టండి

- ప్రణాళిక ప్రకారం ప్రచారం నిర్వహించాలె
- ‘మల్కాజ్‌గిరి’ పై కాంగ్రెస్‌జెండా ఎగరేయాలె
- ‘హోలీ’ లోపు పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తాం
- క్యాడర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**విశాల భారతి, సిటీబ్యూరో:**

ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరి పార్లమెంట్ లో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్ధేశం చేశారు. తాను సీఎంగా ఉన్నానంటే.. ఆ గొప్పతనం మల్కాజిగిరి కార్యకర్తలదేనన్నారు. ఆనాడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా.. కార్యకర్తలు భుజాలపై మోసి గెలిపించి తనను ఢిల్లీకి పంపించారని గుర్తు చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు.

**మల్కాజిగిరి నుంచే కేసీఆర్ పతనం**

“దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజిగిరి. నాటి గెలుపు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసింది. కేసీఆర్ పతనం

..మిగతా 2 లో

### అడవులను కంటికి రెప్పలా కాపాడిన
## దార్శనికుడు కేసీఆర్

- ప్రకృతి ప్రేమికుడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



దశాబ్దాల పాటు ధ్వంసమైన అడవులను కంటికి రెప్పలా కాపాడిన దార్శనికుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో ఆగమైన అడవి సంపద చుట్టూ అందమైన పచ్చని పందిరి అల్లిన ప్రకృతి ప్రేమికుడు కేసీఆర్ అని ప్రశంసించారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించేందుకు చేసిన కృషిని ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వివరించారు.

ఆనాడు తెలంగాణలో హరితహారం మహోద్యమంలా సాగిందని.. 230 కోట్ల మొక్కలు నాటాలన్న సంకల్పంతో ముందుకెళ్లామని కేటీఆర్ సూచించారు. అది ప్రపంచ చరిత్రలోనే మూడో అతిపెద్ద మానవ ప్రయత్నమని పేర్కొన్నారు. సుమారు 15 వేల నర్సరీల పెంపకం మహాయజ్ఞంలో సరికొత్త అధ్యాయమని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రీన్ కవర్ 8 శాతం పెరిగిందని.. అది దేశ చరిత్రలోనే నెవర్ బిఫోర్ అని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే.. ప్రజల బతుకుచిత్రాన్ని మార్చడమే కాదు.. చిక్కిశల్యమైన అడవులను.. సకల జీవరాశులను సంరక్షించడమని.. నలుదిశలా చాటిచెప్పిన నాయకత్వం మనది పేర్కొన్నారు.



### నేను సీఎం
## అవుతాననుకోవడం మూర్ఖత్వమే..

- ‘ధరణి’ అక్రమాలు ఆధారాలతో బయట పెడ్తం
- రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసి తీరుతాం
- మేం గేట్లు తెరవలే... తెరిస్తే బీఆర్ఎస్ ఖతమే..
- బీజేపీ కి టచ్‌లోకి వెళ్లాననడం అవాస్తవం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి పదవిపై రెవెన్యూ, సమాచారా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్రెస్టింగ్‌కామెంట్స్‌చేశారు. గురువారం మీడియాతో చిట్ చాట్ చేసిన ఆయన.. కాంగ్రెస్‌లో జూనియర్‌గా ఉన్న తనకు ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకోవడం ఆచరణ సాధ్యం కాదని ప్రస్తావిస్తూ.. నిక్కచ్చిగా తన అభిప్రాయాలను వెల్లడించారు. తన రాజకీయ ఆకాంక్షల గురించి ఎలాంటి ఆధారాలు లేకుండా ఊహాగానాలు, రాతలు రాస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ‘నేను ముఖ్యమంత్రిని అవుతానని అనుకోవడం మూర్ఖత్వానికి నిదర్శనం’ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మొత్తం 11 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, అందులో మూడింటిలో తీవ్ర పోటీ ఉంటుందని పొంగులేటి దీమాగా చెప్పారు. బీజేపీ రెండు సీట్లు మాత్రమే గెలుచుకోవచ్చని, బీఆర్ఎస్ ఒకటి లేదా రెండు సీట్లు గెలుచుకోవచ్చని ఆయన

..మిగతా 2 లో

## ‘గ్రేటర్’ గెలుపుపై కాంగ్రెస్ ఫోకస్!

- పార్లమెంట్లలో పాగా వేసేందుకు ప్లాన్స్..
- అసెంబ్లీ తరహాలో డీలా పడకుండా ఎత్తుగడలు
- సత్తాచాటేందు ‘హస్తం’ పార్టీ నేతల కసరత్తు
- బల్దియా పరిధిలోని స్థానాల్లో సీఎం సమీక్షలు
- సెగ్మెంట్ల వారీగా అబ్జర్వర్ల నియామకం
- ఎట్టి పరిస్థితుల్లోను మల్కాజ్‌గిరి గెలవాలన్న రేవంత్
- సవాల్‌గా మారిన ‘హైదరాబాద్’ అభ్యర్థి ఎంపిక
- బీఆర్ఎస్‌కు రిటర్న్‌గిఫ్ట్‌ఇస్తామంటున్న నేతలు

*గ్రేటర్‌హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గతమంతా ఘనంగానే ఉన్నా.. తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దకాలంగా అధికారానికి దూరమై డీలా పడిపోయింది. గత బల్దియా ఎన్నికల్లో మచ్చుకైనా 3 స్థానాల్లో కూడా ‘హస్తం’ పార్టీ గెలవలేదు. పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టకేలకు అధికారం దక్కించుకున్నా.. గ్రేటర్‌హైదరాబాద్ నియోజకవర్గాల్లో ఒకే ఒక్క సీటు గెలిచింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్‌పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకుంటుందా? లేదా ? అన్న ఆసక్తికర చర్చ సాగుతోంది.*

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో గ్రేటర్‌హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నేతల హవా ఉండేది. హైదరాబాద్‌లో పుట్టిన మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య లాంటి వారు రాష్ట్ర ముఖ్యమంత్రులయ్యారు. కొండా వెంకట రంగారెడ్డి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. సీఎం ఎవరైనా గ్రేటర్‌హైదరాబాద్ నేతలకు ప్రయార్టీ ఉండాల్సిందే. శంకర్ రావు, వి. హన్మంతరావు లాంటి వాళ్లు మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ‘హైదరాబాద్ బ్రదర్స్’గా పీజేఆర్, మర్రి శశిధర్ రెడ్డి పేరు గడించారు. ఆ తర్వాత దానం నాగేందర్, ముఖేశ్ గౌడ్ లు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించారు. భాగ్యనగరంలో కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఘనంగా ఉంది. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి విజయం

..మిగతా 2 లో



## ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పరార్!

- అమెరికా వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్న పోలీసులు
- 2018 నుంచే అక్రమ ట్యాపింగ్ దందా షురూ
- ప్రణీత్‌రావును నడిపించింది ఆయనేనని ఆరోపణలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు టాప్ చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు

..మిగతా 2 లో



## దేశ వృద్ధిపై చైనా, పాకిస్తాన్ కుట్ర

- అంతర్జాతీయంగా మోడీ వ్యతిరేకంగా అనేక శక్తులు పనిచేస్తున్నాయి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

భారతదేశ ఎదుగుదలపై చైనా, పాకిస్తాన్ కుట్ర చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఎక్కడా కనిపించని దేశం.. ఇప్పుడు నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలను శాసించేస్థాయిలో ఉండటంతో పాక్, చైనా సహించలేకపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన బాగ్ అంబర్ పేట డివిజన్ లో బస్తీ పర్యటన చేశారు. అనంతరం సీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. మేక్ ఇన్ ఇండియాతో చైనా వెనుకబడిపోయిందని, ఆ కారణంగా చైనా దేశం భారత్ పై పాకిస్తాన్ తో కలిసి కక్ష గట్టి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీని ఓడించాలని కుట్రలు చేస్తోందన్నారు. దేశ గౌరవం పెరగాలంటే.. మోడీ మళ్లీ గెలవాలని ఆయన ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక శక్తులు ప్రధానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.



# మోడీ కుట్రతోనే.. బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్

**మొదటిపేజీ తరువాయి**

డబ్బులు ఖర్చు చేయలేకపోతున్నామని.. తమ పార్టీ నేతలు ఎక్కడికీ పంపించలేకపోతున్నామని తెలిపారు. విమానాల్లో ప్రయాణించడం పక్కనపెడితే కనీసం నేతలకు రైలు టికెట్లు కొనడానికి కూడా తమ పార్టీ వద్ద డబ్బులు లేవని రాహుల్ గాంధీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లలో 20 శాతం ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని.. కానీ ప్రస్తుతం కేంద్ర తీసుకున్న చర్యలతో తాము రూ.2 కూడా డబ్బులు ఖర్చు చేయలేని దీనస్థితిలో ఉన్నామని చెప్పారు.తమ బ్యాంకు ఖాతాలను కేంద్రం స్తంభింపజేస్తోందని కంప్లైంట్ చేసినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రాహుల్ గాంధీ వివరించారు. అయితే కేంద్రం చేస్తున్న ఈ పనులు కేవలం కాంగ్రెస్ పార్టీ ఖాతాలను ఫ్రీజ్ చేయడం కాదని.. భారతదేశ ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమనేనని తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయిందని మండిపడ్డారు. ఎన్నికల్లో పోరాడకుండా కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ ఖాతాల్లోని డబ్బులను కేంద్రం బలవంతంగా లాగేసుకుంటోందని సోనియా గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలను ఉపయోగించుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒకవైపు ఎన్నికల బాండ్ల వ్యవహారం.. మరోవైపు దేశంలోని ప్రధాన ప్రతిపక్షం ఆర్థిక లావాదేవీలపై దాడి జరుగుతోందని సోనియా విమర్శించారు. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తుందని సోనియా తెలిపారు.లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలంటే ఫ్రీజ్ చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. తమ పార్టీ అభ్యర్థులు ప్రచారం చేసుకోవడానికి ఇచ్చేందుకు కూడా తమ వద్ద డబ్బులు లేవన్నారు. సరిగ్గా ఎన్నికల సమయం చూసి కాంగ్రెస్ పార్టీని నరేంద్ర మోదీ దెబ్బతీస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. ఇక ఎన్నికల బాండ్ల ద్వారా దేశంలో ఏ పార్టీ లబ్ది పొందిందో దేశం మొత్తానికి ప్రస్తుతం తెలిసిపోయిందని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. ఇది దేశంలో చాలా తీవ్రమైన అంశమని తెలిపారు.

# కాంగ్రెస్ థర్డ్‌లిస్ట్ రిలీజ్

**మొదటిపేజీ తరువాయి**

స్థానాలకు (జహీరాబాద్ సురేశ్ కుమార్ షెట్కర్, నల్గొండ కుందూరు రఘువీర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ చల్లా వంశీచందర్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్) అభ్యర్థులను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇంకా.. ఖమ్మం, భువనగిరి, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రకటించిన మూడు జాబితాల్లో కాంగ్రెస్ 139 మంది అభ్యర్థులను ఖరారు చేసింది.

# ఉదయం 7 గంటలకే బస్తీ బాట పట్టండి

**మొదటిపేజీ తరువాయి**

2019లో మల్కాజిగిరి నుంచే మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. 100 రోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేశాం. మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిది. మల్కాజిగిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావాలన్నా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి.

మల్కాజిగిరి ఎన్నిక అభ్యర్థిది కాదు..ముఖ్యమంత్రిది.. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా తుపాను వచ్చినట్లు గెలిచినా.. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఆశించిన స్థాయిలో రాలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 4 స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది. అందుకే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఇప్పుడు కాంగ్రెస్ జెండా ఎగరాలి. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ గెలవాలి. హోలీ పండగలోగా హైకమాండ్‌అభ్యర్థులను ప్రకటిస్తుంది. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది. ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీ బాట పట్టాల్సిందే. ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించుకోవాలి. మల్కాజిగిరి క్యాంపెయిన్ మోడల్ రాష్ట్రమంతా అనుసరించేలా చేయాలి. ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నిక అభ్యర్థిది కాదు..ముఖ్యమంత్రిది. నా బలం.. నా బలగం మీరే'' అని సీఎం వివరించారు.

# ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పరార్!

**మొదటిపేజీ తరువాయి**

ఎదుర్కొంటున్న ప్రణీత్ రావు వ్యవహారం రోజు రోజుకు అనేక మలుపులు తిరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రణీత్‌కు అండగా ఉన్న ఎస్ఐబీ( స్పెషల్ ఇంటలిజెన్స్‌బ్రాంచ్) మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను సమాచారాన్ని ధ్వంసం చేశానని ప్రణీత్‌రావు వెల్లడించిన సంగతి తెలిసిందే.

2018 నుంచే అక్రమ ట్యాపింగ్ దందా మొదలైనట్లు పోలీసులు గుర్తించారు. ఇజ్రాయిల్ నుంచి మోడ్రన్ వెపన్స్ కొనుగోలు చేయగా, రామ్ గోపాల్ కన్సల్టెంట్ , అడ్వైజర్‌గా వ్యవహరించారు. ఆదిలాబాద్ ఘర్షణ సమయంలో అక్కడ వినియోగించినట్లు గుర్తించారు. ప్రణీత్‌రావు కేసులో మరో నలుగురికి నోటీసులు జారీ చేశారు.

కాగా, మాజీ ఐపీఎస్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు బంధువే ఈ ప్రణీత్ రావు. ప్రణీత్ కెరీర్‌లో అడుగడుగునా ప్రభాకర్ రావు అండగా ఉన్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు నల్గొండ ఎస్పీగా ఉన్నప్పుడే ప్రణీత్ ప్రొబేషన్ క్లియరెన్స్ అయ్యింది. అలాగే.. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్ కాగానే.. ప్రణీత్‌కు ఎస్ఐబీలో పోస్టింగ్ లభించింది. ఇదిలా ఉంటే.. ఎస్ఐబీలో ఉన్న ఇతర ఇన్‌స్పెక్టర్లను కాదని ప్రణీత్‌ను వెనకేసుకొచ్చారని ప్రభాకర్‌పై ఆరోపణలు కూడా ఉన్నాయి. అందులో భాగంగానే రూల్స్‌కు విరుద్ధంగా ప్రణీత్‌కు డీఎస్పీగా ప్రమోషన్ ఇప్పించారని ప్రభాకర్‌పై బలమైన ఆరోపణ కూడా ఒకటి ఉండడం గమనార్హం.

# ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు ఇచ్చేశాం

- కేంద్ర ఎన్నికల సంఘానికి ఎస్ బీఐ నివేదిక

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఎన్నికల బాండ్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేయడంతో భారతీయ స్టేట్ బ్యాంక్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీరియల్ నంబర్లతో సహా బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. ఈమేరకు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ''సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఎలక్షన్ కమిషన్‌కు అందజేశాం. భద్రతా కారణాల దృష్ట్యా బ్యాంకు ఖాతాల నంబర్లు, కేవైసీ వివరాలను బహిర్గతం చేయలేదు'' అని పేర్కొంది. ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో జారీ చేసిన బాండ్ల వివరాలను ఈసీకి అందించాలని ఎస్‌బీఐని ఆదేశించింది. ఆ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన బ్యాంకు.. బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్లను మాత్రం బయటపెట్టలేదు. ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే ఈ నంబర్లు లేకపోవడంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బ్యాంకు తీరుపై అసహనం వ్యక్తంచేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను (నంబర్లతో సహా) ఈసీకి ఇచ్చేశామని చెబుతూ మార్చి 21 (గురువారం) సాయంత్రం 5 గంటల్లోగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ ఛైర్మన్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఈ క్రమంలోనే బ్యాంకు వివరాలు సమర్పించింది. వాటిని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనుంది.

# ప్రశ్నిస్తే కేసులేనా?

- నా ఫోన్ ఎందుకు సీజ్ చేశారు?
- జర్నలిస్టులు వార్తలు రాస్తే వాళ్ల మీద కూడా కేసులు పెడతారా?
- రేవంత్ డైరెక్షన్ లోనే అరెస్టులు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారని ఒక పత్రిక రాస్తే దాని మీద కేసు వేశారు.. అక్రమ భూదందా గురించి మాట్లాడితే నా మీద కేసు వేసి, నా ఫోన్ సీజ్ చేశారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ తెలిపారు. ఈ కేసులు వేసింది కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ గౌడే అని పేర్కొన్నారు. ఇవన్నీ రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరుగుతున్నాయని ఆయన చెప్పారు. తెలంగాణ భవన్‌లో మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు.చిత్రపురి సిటీ భూదందాపై పోస్టు చేసినందుకు నా ఫోన్‌ను మాదాపూర్ పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌ను కోర్టులో డిపాజిట్ చేయాలని కోరుతున్నాం. మొబైల్ ఫోన్లు సీజ్ చేసే అధికారం మీకు ఎవరిచ్చారు..? ఇదేక్కడి సంస్కృతి..? అని క్రిశాంక్ ప్రశ్నించారు. గతంలో రాష్ట్రంలో ఎవరెవరో ఏది చేసినా.. ప్రతిదాన్ని కేసీఆర్‌కు ముడిపెట్టారు కదా..? మరి ఇవాళ రేవంత్ రెడ్డితో ఫొటో దిగిన అనుముల మహానందరెడ్డిపై కూడా విచారణ చేయాలని కోరుతున్నామన్నారు.మొబైల్ ఫోన్లు సీజ్ చేస్తామంటే.. రేపటి రోజున జర్నలిస్టులు కూడా ఎన్నో వార్తలు రాస్తారు.. వారి ఫోన్లు కూడా సీజ్ చేస్తారా..? ఇది చిన్న విషయం కాదు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ గౌడ్ కేసులు వేశారు. మొన్న బేగంపేట ఎయిర్‌పోర్టులో రేవంత్ రెడ్డి, చంద్రబాబు సమావేశమైనట్లు ఒక పత్రిక రాసింది. ఆ పత్రిక మీద కేసు వేసింది కూడా మహేశ్ గౌడే. అంటే రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తే.. వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ గౌడ్‌చే పోలీసులకు ఫిర్యాదు చేయిస్తున్నారు. చంద్రబాబుతో రేవంత్ సమావేశం గురించి క్లారిఫికేషన్ ఇచ్చుకోకుండా కేసులు వేశారు. గాంధీ భవన్ వర్గాలు లేదా ప్రభుత్వం వర్గాలు వివరణ ఇవ్వాల్సింది పోయి న్యూస్ పేపర్ మీద కేసు వేస్తారా...? ఇవాళ కూడా నాపై కేసు వేసి ఫోన్ సీజ్ చేయించింది కూడా మహేశ్ గౌడే. రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో ఇదంతా జరుగుతోంది. ఇవాళ ఒక పత్రిక మీద కేసు వేశారు. రేపు ఇంకో పత్రిక మీద వేస్తారు. ఇవాళ ఒక పార్టీ మీద దాడి.. రేపు మరో పార్టీపై దాడి జరగొచ్చు. ఇదేనా ప్రజా పాలన అని మన్నె క్రిశాంక్ నిలదీశారు.





# కాంగ్రెస్ ది పచ్చి మోసం

- ఎస్సారెస్పీ ఫేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటూ నమ్మించిన కాంగ్రెస్
- పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం నుంచి ఎందుకు నీటిని ఎత్తిపోయరు
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సూటి ప్రశ్న

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాట ఇచ్చి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం చరిత్రలో లేదని.. ఆ అపకీర్తి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. రైతుల కోరిక మేరకు ఆయన చేపట్టిన పర్యటన ఐదోరోజు గురువారం కొనసాగింది. యార్కారం, రేఖ్యానాయక్ తండాల్లో ఎండిన పంట పొలాలను పరిశీలించి.. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎస్సారెస్పీ ఫేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారన్నారు. హామీ ఇచ్చి పంటలకు నీరు ఇవ్వకుండా కాంగ్రెస్ రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. ప్రభుత్వాన్ని నమ్మి ఒక్కో రైతు 25 నుంచి 30వేల పెట్టుబడి పెట్టి ఆగమయ్యారన్నారు. ప్రభుత్వం అవగాహన రాహిత్యం వలన రైతులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. జాలువారిన పంట పొలాలు నేడు మోడు వారడానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో కేసీఆర్ రైతాంగాన్ని సస్యశ్యామలం చేస్తే.. మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందని.. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడానికి మూడు పిల్లర్ల కుంగుబాటుకు సంబంధం లేనప్పటికీ గత ప్రభుత్వాన్ని అభాసు పాలు చేసేందుకు రైతాంగానికి నీళ్లు ఇవ్వలేదన్నారు. రైతుబంధు రాలేదని ప్రశ్నించిన రైతును మంత్రి చెప్పు తీసుకొని కొడతాననడం దుర్మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంట పొలాలు ఎండిపోతున్నప్పటికీ మంత్రులు కనీసం సమీక్ష చేయడం లేదని.. పంట నష్టంపై మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వాలన్నారు.



# 'గ్రేటర్' గెలుపుపై కాంగ్రెస్ ఫోకస్!

**మొదటిపేజీ తరువాయి**

సాధించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, సిట్టింగ్ పార్లమెంట్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ఇదిలా ఉంటే పార్లమెంట్ పరిధిలో ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా కాంగ్రెస్ గెలవలేకపోయింది. గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడానికి రెడీగా ఉన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ కండువా ఏ క్షణమైన కప్పుకునే అవకాశాలున్నాయి. ఈ పార్లమెంట్ స్థానం నుంచి ఇటీవలే 'హస్తం' గూటికి చేరిన వికారాబాద్ జడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డిని లోక్‌సభ ఎన్నికల బరిలో దింపాలని కాంగ్రెస్ యోచిస్తోంది. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్‌పై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సీటులో పోటీ చేసేందుకు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు తీవ్రంగా పోటీపడుతున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల బాధ్యతలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా తుమ్మల ముఖ్యనేతలందరితో సమావేశమవుతూ అభిప్రాయాలు సేకరిస్తున్నారు. రేవంత్ రెడ్డి తన సిట్టింగ్ స్థానంలో ఎవరికి ఛాన్స్ ఇస్తారు? పార్టీలో ఉన్న పాత లీడర్లకు అవకాశం కల్పిస్తారా ? కొత్త నేతలే పోటీలో దిగుతారా ? అన్నది చూడాలి.

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో గతంలో అంజన్ కుమార్ యాదవ్ ఎంపీగా గెలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని స్థానాలను బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్‌చేసింది. ఈ సారి కేంద్ర మంత్రిగా ఉన్న బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్ రెడ్డిని ఓడించాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. బలమైన నేతను బరిలో దింపాలని యోచిస్తోంది. బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను బరిలో దించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ సీటు కోసం జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, దానం నాగేందర్ వైపే కాంగ్రెస్ హైకమాండ్‌మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మున్నూరు కాపు, యాదవ, క్రిస్టియన్, ముస్లీం మైనార్టీ ఓట్లతో బీజేపీని దెబ్బకొట్టవచ్చని కాంగ్రెస్ లెక్కలు వేస్తోంది. ఈ లెక్కన లష్కర్ లో కాంగ్రెస్ లెక్కలు ఏ మేరకు వర్కవుట్ అవుతాయో చూడాలి.

ఇక చేవెళ్ల పార్లమెంట్ పై గతంలో కాంగ్రెస్ కు గట్టి పట్టుంది. కేంద్ర మంత్రిగా పనిచేసిన సూదిని జైపాల్ రెడ్డి ఇక్కడ నుంచి 2009లో విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడ గెలవలేకపోయింది. 2019 ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ 20 వేల ఓట్ల స్వల్ప మెజారిటీతో జారవిడుచుకుంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి పోటీకి సై అంటున్నారు. మొన్నటి వరకు ఇక్కడ వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌సునీతామహేందర్ రెడ్డి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. రంజిత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడంతో సమీకరణాలు మారిపోయాయి. సునీతా రెడ్డిని మల్కాజిగిరికి షిఫ్ట్ చేసి రంజిత్‌రెడ్డిని పోటీలో దింపేందుకు కాంగ్రెస్ పార్టీ స్కెచ్ వేసింది. రాజకీయ రణరంగంలో కండువా మార్చి ఎన్నికల బరిలో దిగుతున్న రంజిత్ రెడ్డిని చేవెళ్ల ప్రజలు ఆదరిస్తారా? లేదా అనే చర్చ సాగుతోంది.

హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ స్ట్రాటజీ ఏమిటనేది అంతుచిక్కడం లేదు. మజ్లిస్ పార్టీ దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆ సీటుపై కాంగ్రెస్ ఫోకస్ పెడుతుందా? లేదా? అన్నది కాంగ్రెస్ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాలను ఎంఐఎం గెలవగా.. ఒక స్థానంలో బీజేపీ గెలిచింది. పార్లమెంట్ స్థానంలో క్యాడర్ ను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ఎలాంటి ఎత్తుగడలను అమలు చేస్తుందో చూడాలి. ఆర్థికంగా బలంగా ఉన్న నేతలనే ఎన్నికల బరిలో దించాలని కాంగ్రెస్ హైకమాండ్‌భావిస్తోంది. సామాజిక సమీకరణాలు.. స్థానిక పరిస్థితులు.. సీనియర్ల నుంచి ఒత్తిళ్ల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సవాళ్లను ఎదుర్కొంటోంది. కొత్తగా చేరిన వారికి టికెట్లు కేటాయించవద్దని పాత నేతలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాలు ఎలా ఉంటాయో చూడాలి.

# కేజ్రీవాలే సీఎంగా ఉంటారు

**విశాల భారతి,డోర్నకల్ ;**

ఢిల్లీ మద్యం విధానం కేసులో సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసినప్పటికీ.. ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని, ఆయన్ను ఎక్కడ ఉంచితే అక్కడినుంచే పాలన కొనసాగిస్తారని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత అతిషీ అన్నారు. ఇదే విషయాన్ని తాము ఎప్పట్నుంచో చెబుతున్నామని గుర్తు చేశారు. ఆయన జైలు నుంచి పనిచేయకుండా నిరోధించే చట్టం లేదని, ఆయనకు శిక్షపడలేదన్నారు. కేజ్రీవాల్ అరెస్టును కుట్రగా పేర్కొన్న అతిషీ.. గత రెండేళ్ల నుంచి దాదాపు 500 మందికి పైగా అధికారులు ఈ కేసులో ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేకపోయారని విమర్శించారు. ఢిల్లీ మద్యం కేసులో సీఎం కేజ్రీవాల్ ఇంట్లో శుక్రవారం సాయంత్రం సోదాలు జరిపిన ఈడీ అధికారులు ఆయన్ను విచారించిన తర్వాత అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంతో పాటు పలుచోట్ల పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన శ్రేణులు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొంటున్నారు. మరోవైపు, కాంగ్రెస్, డీఎంకే సహా పలు విపక్షాలు కేజ్రీవాల్ అరెస్టును ఖండించాయి. పలు రాష్ట్రాల్లో ఆప్ ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విపక్షాలను ఎదుర్కొనేందుకు కేంద్రం ఈడీని ప్రయోగిస్తోందని మండిపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇలాంటి చర్యలకు దిగడమంటే.. రాజకీయ కక్షసాధింపు చేయడం ద్వారా విపక్షాలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమేనని నేతలు విమర్శిస్తున్నారు.



# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**విశాల భారతి: ఖైరతాబాద్:**

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నరేశ్ రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేశ్ రెడ్డితో పాటు మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు జెడ్పీటీసీ భర్త మురళీధర్ రెడ్డి, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి, బాలుచౌహాన్, జేఏసీ నాయకులు మెంచు అశోక్, మాజీ సర్పంచులు నూకల అభినవ్ రెడ్డి, బానోత్ రాంలాల్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా.రామచంద్రునాయక్ పాల్గొన్నారు.



# 'వ్యక్తా ప్లే స్కూల్' ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- ఎమ్మెల్యేను సన్మానించిన ఫౌండర్ లక్ష్మీనారాయణ

**విశాల భారతి, సిటీబ్యూరో:**

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ డివిజన్.. సాయినగర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వ్యక్తా ప్లే స్కూల్' ను గురువారం ఎల్బీనగర్‌ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్‌ఫౌండర్‌కె. లక్ష్మీనారాయణ, సీఈవోలు కె. శ్రీకాంత్, కె. రాధిక, ప్రిన్సిపాల్ కె. మధుమతితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. స్కూల్‌యాజమాన్యానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను స్కూల్‌ఫౌండర్ కె. లక్ష్మీనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ఉచితకంటి ఆపరేషన్ల శిబిరం

**ధర్పల్లి, విశాల భారతి:**జిల్లా అందత్వ నివారణ సంస్థ చైర్మన్ జిల్లా కలెక్టర్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, లయన్స్ కంటి ఆసుపత్రి ఆర్మూర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కంటి సమస్యలు ఉన్న వారిని ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ముప్పై నాలుగు మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. అందులో పన్నెండు మందికి కంటి ఆపరేషన్లు జరగాల్సి ఉండగా వారిని లయన్స్ క్లబ్ ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో చేయించడానికి పంపిస్తున్నామని ఆప్తల్మిక్ ఆఫీసర్ హరినాథ్ నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ,శ్రీనివాస్,మల్లేష్ తదితరుల పాల్గొన్నారు.



# మొక్కలను జాగ్రత్తగా కాపాడాలి

**వనపర్తి, విశాల భారతి:**వచ్చే హరిత హారానికి మొక్కలు వనపర్తి జిల్లా నుండే వడుకునె విధంగా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం పెద్దమందడి మండలం జంగమయాపల్లి గ్రామ పరిధిలోని అటవీ శాఖ నర్సరీని సందర్శించి పరి శీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా సరైన విధంగా నీరు పోసి ఎప్పటికప్పుడు బ్యాగులు మారుస్తూ మొక్కలను సమీక్షించాలని సూచించారు. వచ్చే హరిత హారం కార్యక్రమానికి జిల్లాకు అవసర మైన మొక్కలు జిల్లాలోని నర్సరీల నుండే వాడుకునే విధంగా చూడాలని సూచించారు. మొక్కల పెంపకం గురించి ఆరా తీశారు. చనిపోయిన వారి స్థానంలో మరోమారు విత్తనాలు వేసి మొక్కలు వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నర్సరీలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించారు. వారి పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారా లేదా అని ఆరా తీశారు. తమకు దినసరి కూలి పెంచాలని కూలీలు కలెక్టర్ ను కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ కులిలకు దినసరి వేతనం పెరిగే విధంగా కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం ఆమోదిస్తే తప్పకుండా పెరుగుతుందని తెలియజేశారు.



# పోలింగ్ కేంద్రాలకు రూట్ ను నిర్ధారించాలి...

**వనపర్తి, విశాల భారతి:** పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం నగేష్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రూట్ నిర్ధా రణ కోసం గురువారం ఉదయం పెబ్బేరు, శ్రీరంగా పురం మండలాల పరిధిలోని దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లను రూట్ వారీగా తిరుగుతూ పరిశీలించారు. పెబ్బేరు మండల పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 196,197,198,199, 200, 201,202, 203, 204, 205, 242, 243లను, శ్రీరంగాపురం మండల పరిధిలో 230, 231, 232, 237, 238, 239,240, 241, 211, 212 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను పరిశీ లించారు. 85 సంవత్సరాల వయస్సు దాటిన వారిని, ది వ్యాంగుల పేర్లను జాబితాలో మార్కింగ్ చేయాలని ఆదే శించారు. పెబ్బేరు ఎమ్మార్వో బీ లక్ష్మి, ఆర్ ఐ రవీందర్, శ్రీ రంగాపురం ఎమ్మార్వో మురళి, ఆర్ ఐ రాధా కృష్ణ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల హాజరు శాతం పెంచేలా కృషి చేయాలి



**వనపర్తి, విశాల భారతి:**అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రూట్ నిర్ధారణ కోసం గురువారం ఉదయం ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లను రూట్ వారీగా తిరుగుతూ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల ముందలి తాండా పోలింగ్ కేంద్రం సంఖ్య 13, వెనకి తండా 12, మామిడిమాడాలో 10, 11,సలకెలాపూరులో 15, 16, అప్పరెడ్డిపల్లిలో 17,18 మల్కిమియాపల్లిలో 20, బొడు గట్టు తాండాలో 19/ఎ, రోడ్డు మీది తాండాలో 23 పోలింగ్ స్టేషన్లను సందర్శిం చారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల సందర్శనలో భాగంగా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలను సైతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలకు విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూడాలని, బడి బయట పిల్లలు ఎవరూ ఉండకూడదని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా కృషి చేయాలని చెప్పారు. మామిడిమాడ, వెనికి తండా, ముందరి తాండ పాఠశాలల్లోని విద్యార్తులతో ముచ్చ టించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలను పరిశీలించారు. గణితం, తెలుగు అభ్యసన సామర్థ్యల్ని పరిశీలించారు. వెనికి తండా అంగన్వాడీలో స్టాక్ రిజిస్ట ర్, పోషకహర సామాగ్రిని నిలువలను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఘనపూర్ ఎమ్మార్వో ఆర్. పాండు, ఎంపీడివో టి. వెంకటాచారి, అయా పాటశా లల ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజంగా మీరు ప్రతిరోజూ నిద్రపోతున్నారా?



**మన నిత్య జీవితంలో నిద్ర అనేది అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. మన జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడంలోనూ, కొత్త ఆలోచనలకు పురుడుపోయడంలోనూ, ఏకాగ్రతతో పాటు దైనందిన విషయాలను, జ్ఞాపకాలను మెదడులో భద్రపరచుకోవడంలోనూ నిద్ర అత్యంత ముఖ్యం.**

- **ప్రతి మనిషికి ఆహారం తర్వాత నిద్ర ప్రధాన అవసరం.**
- **ప్రతి మనిషికి అనడం కంటే ప్రతి జీవికి అనడం ముఖ్యం.**
- **పెద్దల మాటల్లో... ఆకలి రుచేరగదు, నిద్ర సుఖమేరగదు అన్నట్లు**

- కడుపు నిండా తినేవాడు, కంటి నిండా నిద్ర పోయేవాడు నిజమైన ఐశ్వర్య మంతుడు.

నిద్ర పోవడం అంటే రేపటి కోసం ఆరోగ్యకరమైన శరీరాన్ని, మనసును సిద్ధం చేసుకోవడం అని చెప్పాలి. నిద్రలో మనకు కనిపించని అవయవాలు అన్ని స్వయంగా శుభ్రం చేసుకుంటాయి అని చెప్పవ చ్చు. మనసుకు కూడా అంతే ముఖ్యమైన విషయాల ను మెదడు జ్ఞాపకాల పొదిలిలో భద్రపరచుకోవడం, అనవరం, ప్రాముఖ్యత లేని సమాచారాన్ని తొలగిం చుకోవడం వంటివి అన్ని నిద్రలో జరుగుతాయి.

దానికి ఒక ఉదాహరణ కూడా చెబుతాను ఎవరికైనా కొంచెం తలనొప్పి వస్తే లేదా మనసు బాగా లేకపోతే మనం ముందుగా చేసే పని నిద్రపోవడం. అంటే నిద్ర మనిషి జీవితంలో నిద్ర ఎంత ముఖ్యమో ఈ విషయం ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు.

అంతే కాదు మీరు ఏదైనా మానసిక ఒత్తిడి లేదా సమ స్యతో బాధపడుతూ, చికిత్స కోసం ఒక సైకాలజిస్ట్ దగ్గరకు వెళ్తే ముందుగా వారు తెలుసుకునే ప్రధాన సమాచారం మీరు రోజులో ఏ సమయానికి, ఎన్ని గంటలు నిద్ర పోతున్నారు, ఏ సమయానికి నిద్ర లే స్తున్నారు మొదలైన సమాచారం ద్వారా మీ సమస్య తీవ్రతను అంచనా వేస్తారు.

నిన్న నేను సరిగ్గా నిద్ర పోలేదు అందుకే ఈ రోజు ఏ పని మీద పెద్దగా ఆసక్తి, శ్రద్ధ ఉండటం లేదు మొదలైన మాటలు మీరు చాలా సందర్భాల్లో వినే ఉంటారు.

- ఈ విషయాలు ఇంతా వివరంగా చెప్పడానికి ముఖ్య కారణం మీ జీవితంలో నిద్ర యొక్క ప్రాము ఖ్యతను గుర్తు చేయడం.

**నిద్రకు సంబంధించిన ప్రధాన సమస్య:**

సైకాలజీ పరిభాషలో నిద్రకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఎక్కువ మందిలో ప్రధానం గా కనిపించే సమస్య ఇన్సోమ్నియా.ఇది 3 వారాలకు మించి నిద్ర పెట్టకపోతే ఇన్సోమ్నియాగా పరిగణిస్తా రు.ఇందులో ప్రధానంగా రాత్రి పడుకునే సమయంలో నిద్ర రాకపోవడం, మధ్య రాత్రిలో మెలుకువ వచ్చి నిద్ర రాకపోవడం లేదా తెల్లవారుజామున మెలుకువ వచ్చి నిద్ర రాకపోవడం మనం గమనించవచ్చు.

**నిద్రలేమిపై జరిపిన పరిశోధనల వివరాలు:**

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), జాతీయ రహదారి భద్రత సంస్థ,NIH, వంటి సంస్థలు జరిపిన పరిశోధనల ప్రకారం ఎక్కువ ప్రమాదాలు నిద్రలేమి వల్లనే జరుగుతున్నాయి.
- స్మార్ట్‌ఫోన్‌ల నుంచి వెలువడే నీలం రంగు వెలుతురు కళ్లపై పడి నిద్ర రాకుండా చేస్తుందని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.
- గర్భిణీ స్త్రీలలో నిద్రలేమి వల్ల పుట్టబోయే శిశువుకు మానసిక, శారీరక అంగవైకల్యం వచ్చే ప్రమాదం కూడా అధికమని పరిశోధనలు తెలుపుతున్నాయి.
- నిద్రలేమి సమస్య వయసు ఆధారంగా, స్త్రీ, పురుషుల్లో భిన్నంగా ఉంటుంది. బ్రిటన్‌లో చేసిన ఓ పరిశోధనలో రెండు వేల మంది పాల్గొన్నారు. ఈ పరిశోధనలో మహిళలు ఎక్కువగా నిద్రలేమితో బాధపడుతున్నారని తేలింది.
- నిద్రలేమి సమస్య వల్ల పని మీద శ్రద్ధ తగ్గిపోతుం దని పరిశోధనల ద్వారా గ్రహించిన కొన్ని కార్పొరేట్ సంస్థలు ప్రత్యేకమైన వసతులతో న్యాప్రూం ఏర్పాటు
- చేసి తమ ఉద్యోగులకు పని వేళలో కొంత సమ యాన్ని నిద్ర పోవడానికి అవకాశం కల్పించాయి.

శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే

- పెద్దవారు 8 గంటలు, పిల్లలు 10 గంటల పాటు నిద్రపోవాలి.

**హాయిగా నిద్ర పోవడానికి చేయాల్సిన, చేయకూడని కొన్ని పనులు:**

1. పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందే భోజనం చేసి ఉండాలి.
2. రాత్రి తీసుకునే ఆహారంలో శుభ్రంగా కడిగిన పండ్లు, డ్రై ఫ్రూట్, పాలు లాంటివి తీసుకోవాలి.
3. ఆహారంలో జంక్ ఫుడ్స్, కూల్ డ్రింక్స్, కాఫీ లాంటివి తీసుకోకూడదు.
4. సాయంత్రం పూట ప్రశాంతమైన వాతావరణంలో కాసేపు వాకింగ్ చేయడం అవసరం.
5. రాత్రి పడుకునే ముందు చల్లని నీటితో స్నానం చేయడం అలవాటు చేసుకోండి.
6. పడుకునే ఏదైనా నచ్చిన పుస్తకం చదవడం లేదా కాసేపు బ్రీతింగ్ మెడిటేషన్ కూడా మంచి అలవాటు గా చెప్పవచ్చు.
7. పడుకోవడానికి గంట ముందే మొబైల్ ఫోన్ లో స్లిపింగ్ మోడ్ ఆన్ చేసి దాన్ని దూరం పెట్టి పడుకొండి.
8. భయంకరమైన, హింస ప్రేరేపిత లేదా మనసు నొప్పించే సినిమాలు చూడకపోవడం మంచిది.
9.పగలు మరి ముఖ్యంగా సాయంత్రం వేళల్లో 'ఎక్కువ సమయం' పడుకోవడం కూడా మానుకొండి.
10.పడుకునే గది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. నిద్రపోయేముందు గదిలో వెలుతురును తగ్గించండి. మీ మంచం, దుస్తులు, గది ఉష్ణోగ్రత అన్నీ మీకు సౌ కర్యంగా ఉండేలా చూసుకోండి.వీలైతే రూం ఫ్రెషనర్ కూడా వాడుకోవచ్చు.
11. అర్ధరాత్రి దాటిన తర్వాత కాకుండా కొంచెం త్వరగా పడుకోవడానికి ప్రయత్నించండి.
12.రాత్రి ఒకవేళ నిద్ర రాకపోతే వీలైతే కాసేపు బయటకు వచ్చి కాసేపు చల్లగాలిలో నిల్చోండి అంతే కానీ మొబైల్ లో మాత్రం చూడకండి.
13. పడుకోవడానికి ముందు మనసుకు నచ్చిన సంగీతం వినడం కూడా ఒక గొప్ప అలవాటుగా చెప్పవచ్చు.

మొత్తంగా శరీరాన్ని, మనసును నిద్రకు అన్ని విధాలుగా సిద్ధం చేసుకోవడం అలవాటు చేసుకోండి.

**నిద్రలేమి వల్ల జరిగే అనర్థాలు:**

నిద్రలేమి క్రమేపీ ఒక దీర్ఘకాల వ్యాధిగా శారీరక, మానసిక మార్పులను తీసుకువచ్చి మతిమరుపు, డి ప్రెషన్, హైపర్ టెన్షన్, యాంగ్జైటీ,ఫోబియా, ఆడిక్షన్, గుండె సంబంధిత వ్యాధులు, రోగనిరోధక శక్తిహీన త,ఒబెసిటీ, రక్తపోటు, డయాబెటిస్, ఊబకాయం వంటి దీర్ఘకాల వ్యాధులకు దోహదం చేయడమే కాకుండా స్త్రీ, పురుషుల్లో సెక్స్ కోరికలు తగ్గడం, పురుషుల్లో టెస్టోస్టిరాన్ హార్మోన్ స్థాయిలు తగ్గి సెక్స్ సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు వృద్ధాప్య ఛాయలు త్వరగా వస్తాయి.

నిద్రలేమి సమస్యకు నిద్రమాత్రలు పరిష్కారం కాదని, ఆలోచనా విధానంలో మార్పుతోనే పరిష్కారం సాధ్య మని సైకాలజిస్టులు అంటున్నారు. కాబట్టి సమస్య తీవ్రతరం కాకముందే సైకాలజిస్ట్ ను సంప్రదించి తగిన చికిత్స తీసుకోండి.



హరీష్ ఆజాద్ (సైకాలజిస్ట్)
7382173741



# ఆర్మూర్ మున్సిపల్ నూతన చైర్మన్ ఎన్నిక

**ఆర్మూర్, విశాల భారతి:**ఉత్కంఠ భరితంగా సాగిన ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక గురువారం నాటికి ముగిసింది. నూతన చైర్మన్ గా వన్నెల దేవి లావణ్య శ్రీనివాస్ ఎంపికైనట్లు ఆర్డీఓ రాజా గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు ప్రకటించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా 30 మంది కౌన్సిలర్లు నూతన చైర్మన్ ఎన్నికకు హాజరయ్యారు. మిగతా ఐదు మంది బిజెపి కౌన్సిలర్లతో పాటు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత నూతన చైర్మన్ ఎంపికకు గైర్హాజరయ్యారు. 23 మంది కౌన్సిలర్లు వన్నెల్ దేవి లావణ్య చైర్మన్ ఎన్నికకు మద్దతు ప్రకటించారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరివినయ్ కుమార్ రెడ్డి పంతం దక్కించుకున్నారు. అనంతరం వినయ్ రెడ్డిని కలిసి ఎన్నికలకు సహకరించినందు కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేశారు.



# అనుమానిత లావాదేవీలపై దృష్టి పెట్టాలి

- **బ్యాంకర్లతో మీటింగ్‌లో సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి***

**విశాల భారతి:, సిరిసిల్ల:** లోక్ సభ ఎన్నికల నేపథ్యం లో బ్యాంకుల పరిధిలో అనుమానిత లావాదేవీలపై దృష్టి పెట్టాలని బ్యాంకు అధికారులను అదనపు కలెక్ట ర్ పూజారి గౌతమి ఆదేశించారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో బాగంగా బ్యాంకుల కోఆర్డినేటర్లతో జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయంలోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రూ. లక్ష నగదు తీ సుకున్నా, ఖాతాలో వేసిన వారి వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమాచారం ఇవ్వాలని ఆదేశిం చారు. రూ. 10 లక్షల కంటే ఎక్కువ జమ అయినా, తీసుకున్న వారి వివరాలను ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఒకేసారి ఎక్కువ ఖాతాలకు డబ్బులు బదిలీ చేసినా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నిక ల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక ఖాతా తీసుకోవాలని, అన్ని లావాదేవీలు అదే ఖాతా నుంచి చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల ఖాతాలపై దృష్టి పెట్టాలని బ్యాంకుల కో ఆర్డినేటర్లు వివరించారు. ఏటీఎంలు, బ్యాంకులకు నగదు తరలించే ముందు వాహనం నంబర్, వెళ్లే వారి పూర్తి వివరాలు, ఎంత డబ్బు తీసుకెళ్తున్నారు? తేదీ తదితర వివరాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజ్యూర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) యాప్ వినియోగం పై వివరించారు. ఎన్నికల నియమావళిని బ్యాంకు అధి కారులు తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎల్డీఎం మల్లికార్జున రావు, ఆయా బ్యాంకుల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధే లక్ష్యం

- **కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తెస్తా**
- **కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దిన ఘనత నాదే**
- **కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి కూడా బండి సంజయ్ నయాపైసా తేలేదు**
- **బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్**
- **మార్నింగ్ వాక్ లో ప్రజలను ఆత్మీయంగా పలకరింపు**

**విశాల భారతి:కరీంనగర్ బ్యూరో:** 'అభివృద్ధే నా లక్ష్యం.. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూడా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృ ద్ధి కోసం నిధులు తీసుకొస్తా. అధికార బీజేపీ కేంద్ర ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంన గర్ అభివృద్ధికి ఐదు రూపాయలు తీసుకురాలేదు. నేను 2014నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ కు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తీసుకొచ్చా. హైదరాబాద్ నగరంతో పోటీ పడే విధంగా కరీంనగర్‌ను తీర్చిదిద్దాను. కరీంనగర్ లో ఐటీ టవర్ కూడా ఏర్పాటు చేయడం జరిగింది' అని కరీంనగర్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీం నగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే (సర్కస్ గ్రౌండ్) లో మేయర్ సునీల్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, స్థానిక కార్పొరేట ర్ రమణారావు, నగర కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయ కులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. మార్నింగ్ వాక్ కు విచ్చేసిన నగరవాసులను ఆత్మీయంగా పలకరిం చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తను ఎంపీగా ఉన్న సమయంలో మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వే లైన్ మంజూరు చేయించడం జరిగిందని, ప్రస్తుతం సిద్ధిపేట వరకు రైలు నడుస్తుం దని, 2025 డిసెంబర్ వరకు కొత్తపల్లి వరకు రైలు నడుస్తోందని పేర్కొన్నారు. కరీంనగర్ లో ట్రిబుల్ ఐటీ కోసం 50 ఎకరాల స్థలం కేటాయించడం జరి గిందని, 2019లో ఎంపీగా తాను ఓటమి చెందిన తర్వాత ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ పట్టించుకోక పోవడంతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించిందని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసి చూపిస్తానని, కేంద్రంలో, రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కూడా అభివృద్ధి కి నిధులు తెచ్చి ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని పునరుద్ఘటించారు.

బండి సంజయ్ ఒక్క గుడి తేలేదు..ఒక్క నవోదయ బడి సాధించలేదు...ఇప్పుడు ఏం అభివృద్ధి చేశాడని ప్రజల వద్దకెళ్లి ఓట్లు అడుగుతున్నారని దుయ్యబట్టా రు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ చుట్టుపక్కల నాలుగు జాతీయ రహదారుల కోసం గళమెత్తానని, హైదరాబాద్ నుంచి రామగుండం వరకు ఉన్న జాతీయ రహదారిని ఎక్స్ ప్రెస్ వే గా మార్చాలని మాట్లాడటం జరిగిందని గుర్తుచేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు అభి వృద్ధి కోసం.. ప్రజల సమస్యలపై ప్రశ్నించే తనను పార్లమెంట్ కి పంపించాలని ఈ సందర్భంగా వినో ద్‌కుమార్ కోరారు.

# కిరణ్ మృతి కార్మికొద్యమని తీరని లోటు

- తెలంగాణ ప్రగతిశీల ఆటో యూనియన్ వ్యవస్థాపకుడు
- ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక



**విశాలభారతి,హైదరాబాద్:** సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా నాయకుడు, IFTU రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, వి. కిరణ్ గురువారం అనారోగ్యంతో మరణించారు. వారికి సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ , రాష్ట్ర కమిటీ తరఫున జోహార్లు తెలిపారు. బ్రతుకుతెరువుకై నిజామాబాద్ నుండి హైదరాబాద్ కు వలస వచ్చి ఆటో నడుపుతూ ఆటో యూనియన్ నే ఏర్పాటు చేశాడు. తెలంగాణ ప్రగతిశీల ఆటో యూనియన్ స్థాపించడంలో తనే వ్యవస్థాపకుడిగా ఉన్నారు. 1997లో ప్రారంభించిన ఆటో యూనియన్ లో వేలాదిమంది సభ్యులయ్యారు. నేడు హైదరాబాద్ లోనే ఐఎఫ్టియు ఆటో యూనియన్ ప్రసిద్ధి గాంచింది. ఆటో కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేశాడని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు. అనేక కేసులు ఎదుర్కొన్నాడు, జైలుకు కూడా వెళ్లాడు. కార్మికుల కష్టజీవుల కష్టాన్ని తెలిసినవాడు. ధనిక పేద వర్గాల మధ్య ఇంత వ్యత్యాసం ఎందుకు ఉందని ప్రశ్నించేవాడు. అందరికీ సమానమైన హక్కులు కావాలని పోరాడేవాడు. ప్రజాస్వామ్యం కోసం పరితపించేవాడు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం ఆహోర్నిశలు పోరాటం చేశాడు. ఆటో & మోటార్ యూనియన్ సభ్యుల్ని కార్మికుల్ని ఏకం చేసి తీవ్ర ఉద్యమాలు నలిపాడని పార్టీ వర్గాలు తెలిపారు.



# టాక్స్ లు ఎవరికి కట్టారో.. వారి దగ్గరే పర్మీషన్ లు తీసుకోండి..

- అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన కాప్రా ఎంఆర్ఓ.

**విశాలభారతి, జవహర్ నగర్:** టాక్స్ లు ఎవరికి కడుతున్నారో.. వారి వద్ద పర్మిషన్ లు తీసుకొని బాజాప్త నిర్మాలు చేసుకోవాలని కాప్రా మండల్ ఎంఆర్ఓ సుచరిత అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంతోష్ నగర్ లో నిర్మించిన అక్రమ నిర్మాలపై కూల్చితలు చేపట్టారు. సర్వే నెంబర్లు 420, 426, 606 లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 2 స్లాబ్ లను, 3 పిల్లర్లు, బస్టాండ్ వద్ద 2 షెడ్లను మున్సిపల్ కమీషనర్ తాజ్ మోహన్ రెడ్డి, మండల ఆర్ఐ శ్రీలత, పోలీస్ బందోబస్తు మధ్య జేసీబి సహాయంతొ కూల్చివేశారు. అయితే కూల్చివేతల సమయంలో ఎంఆర్ఓ సుచరితను నిర్మాణదారులు అడ్డుకోడానికి ప్రయత్నించడంతొ పోలీసులు అదుపుచేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడంతో పాటు తమ డ్యూటీ నిర్వహిస్తున్న అధికారులను అధికారులను అడ్డుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



# పెండింగ్ లో మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు

**నూతనకల్, విశాలభారతి:** మిషన్ భగీరథ లో పనీ చేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించకపోవడంతో ధర్నా నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలని,కనీస వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని నూతనకల్ మండలం చిల్పకుంట్ల మిషన్ భగీరథ ప్లాంట్ ముందు పనులు బంద్ చేసి కార్మికులు ధర్నాకు దిగారు. గత ఐదు నెలల నుండి వేతనాలు రాకపోవడంతో అధికారులకు, కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదు. గత పది రోజుల క్రితం ఈ సమస్యలను పరిష్కరించాలని సమ్మె నోటీసును డిఈ అశోక్ కి అందజేశారు. కాంట్రాక్టర్లు స్పందించి రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీని అమలు చేయకుండా వేతనాలు చెల్లించకపోవడంతో తిరిగి ధర్నాను చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మొగుళ్ళ గోపాల్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో 16 వేలకు పైగా కార్మికులు ఉన్నారని, వీరికి సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో, ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిపార్ట్మెంట్ లో ఉన్నతాదికారులు ఐదు నెలల నుండి వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతకాలో కనీసం ఆలోచన చేయడం లేదని ,కనీసం కాంట్రాక్టర్ లను కార్మికుల వేతనల కోసం నిలదీయడం లేదని అన్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోసిచుకోవలి అని ప్రశ్నించారు. నిత్యావసర ధరలు,పెట్రోల్,డీజిల్ ధరలు పెరుగుతున్న కనీస వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కుసు ఉప్పలయ్య, పగిల్ల నాగరాజు,బత్తుల హరికృష్ణ, గంట రామకృష్ణ, జటంగి శేకర్,రచ్చ రాము,కటకం సైదులు, బొర ఉపేందర్, మహేష్, సత్యనారాయణ, గంట సైదులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

**సూర్యాపేట, విశాలభారతి:** పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు గురువారం పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి మూడవ అంతస్తులు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. మూడవ అంతస్తులో పరీక్ష కేంద్రాలను పెట్టడం వల్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు . విద్యార్థులు పరీక్ష రాయటానికి మూడంతస్తులు ఎక్కి రావటం వలన విద్యార్థులు అలసటపాలవుతారని, ఇలాంటి పొరపాట్లు మరల చేయవద్దని ఇన్చార్జి డిఈఓ శైలజను ఆదేశించారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి పరీక్ష కేంద్రానికి పంపాలని, సెల్ ఫోన్లు ఎవరు తీసుకొని రావద్దని కలెక్టర్ సూచించారు. గురువారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 179 మందికి గాను 179 మంది హాజరయ్యారని, చీఫ్ సూపర్డెంట్ తబిత కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఇంచార్జి ఎంఈఓ శైలజ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కృత విశ్వవిద్యాలయాన్ని వెంటనే స్థాపించాలి

- డైరెక్టర్ ఆచార్య నీల నీలకంఠం



**సికింద్రాబాద్, విశాలభారతి:** సంస్కృత అకాడమీలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న మల్లినాథసూరి వాఙ్మయ సెమినార్ చాలా వైభవోపేతంగా ముగిసింది. భారతదేశంలోని పలు రాష్ట్రాలనుండి అనేకమంది విద్వాంసులు మల్లినాథుని వ్యాఖ్యానాలపైన, స్వయంగా రచించిన కావ్యాలపైన విస్తృతమైన పరిశోధనా ప్రసంగాలు చేశారు. మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మ ఆచార్య విద్యానంద ఆర్య, తిరుపతి వేద విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య పవన్ కుమార్ శర్మ మహామహోపాధ్యాయ నల్లగొండ పురుషోత్తమ శర్మ ఉస్మానియా విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ. రాములు ఇత్యాది ప్రముఖులు పాల్గొన్న ఈ సమావేశాలకు అకాడమీ డైరెక్టర్ ఆచార్య నీలకంఠం అధ్యక్షత వహించారు. తన కీలక సందేశంలో మొదటిరోజు మల్లినాథుని వ్యాఖ్యానాల గురించి, మల్లినాథుని స్వీయ రచనల గురించి వివరించి ఈనాటి యువసంస్కృత పండితులంతా ముందుకు వచ్చి ఇంకా విస్తృతమైన పరిశోధనలు చెయ్యాలని సూచించారు. గతప్రభుత్వం మల్లినాథసూరి సంస్కృతవిశ్వవిద్యాలయం స్థాపించుటకు ప్రయత్నించినప్పటికి అది కార్యరూపం దాల్చలేదని ఇప్పటి ప్రభుత్వం చొరవ తీసుకుని సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపించాలని సెమినార్లో పాల్గొన్న పండితులంతా ప్రభుత్వాన్ని ప్రార్థించారు. ఆంధ్రప్రదేశ్ లో, కర్ణాటకలో మిగతా అన్ని రాష్ట్రాలలో సంస్కృత విశ్వవిద్యాలయాలున్నాయని తెలంగాణాలో కూడ సంస్కృత విశ్విద్యాలయం స్థాపిస్తే తెలంగాణాలోని ఉత్సాహవంతులైన విద్యార్థలందరికి సంస్కృతం చదువుకునే అవకాశం లభిస్తుందని అనేక సంవత్సరాలు కష్టపడి పి హెచ్ డి లు చేసిన అనేకవందికి సంస్కృతంలో ఉద్యోగాలు లభిస్తాయని ఆచార్య నీలకంఠం అన్నారు. ఈ సందర్భంగా అకాడమీ ముద్రించిన ఐదు విశేషమైన పుస్తకాలను లోకార్పణం చేశారు. డాక్టర్ కే వరలక్ష్మి, డాక్టర్ జోషీ సంతోష్ కుమార్ ఈ సెమినార్ ని ర్వహించారని ఆచార్య నీలకంఠం తెలిపారు. సుమారు నలభై మందికి పైగా శోధపత్రాలు సమర్పించారని నిర్వాహకులు తెలిపారు.



# ప్రజలు చలివేంద్రాలని సద్వినియోగం చేసుకోవాలి

- సుధాకర్ పివిసి అధినేత మీలా మహదేవ్

**సూర్యాపేట, విశాలభారతి:** వివిధ పనుల నిమిత్తం సూర్యాపేట పట్టణానికి వచ్చే ప్రజలు పట్టణంలో పలు చోట్ల ఏర్పాటుచేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సుధాకర్ పివిసి అధినేత మీలా మహదేవ్ అన్నారు. గురువారం సుధాకర్ పివిసి ఆర్థిక సహకారంతో సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉంటున్నందున బాటసారులు ఇట్టి చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుధాకర్ పివిసి ఎంతోమందికి జీవనో భృతి కల్పించడమే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. మా వంతుగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# పాట ప్రజల పక్షాన నిలబడాలి

- అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు నాగన్న

**కోదాడ, విశాలభారతి:** పట్టణంలోని లాల్ బంగ్లాలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు నాగన్న పాల్గొని మాట్లాడుతూ కళాకారులు ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలై ఉండాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ కలాలను, గళాలను శ్రామిక వర్గ ప్రయోజనాల కోసం అంకితం చేసిన వారే నిజమైన కళాకారులని అన్నారు. దేశంలో ఫాసిస్టు ప్రమాదం కారు మబ్బులా కమ్ముకుంటుందని రాజకీయాల్లోకి మతాన్ని చొప్పిస్తు ప్రజల మధ్యన విద్వేషపు అగాధాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. గత చరిత్రను వక్రీకరించే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని అన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతాంగాన్ని నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, గ్రామాల్లో తాగునీటి కొరతను తీర్చేందుకు చెరువులు నింపాలని తెలియజేశారు. ఈ సమావేశంలో అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి సైదులు, సహాయ కార్యదర్శి ఎర్ర ఉమేష్, ఉపాధ్యక్షుడు బొల్లె వెంకన్న, కోశాధికారి గండు నాగేశ్, పశ్య నర్సిరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ

- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు

**మునగాల, విశాలభారతి:** జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆకస్మికంగా మునగాల మండల కేంద్రంను సందర్శించారు. ముఖ్యంగా మండలంలో నీటి ఎద్దడి ఎక్కడెక్కడ ఉన్నాయో తక్షణమే గుర్తించి, ఎక్కడైనా బోర్ వెల్ ఏమైనా రిపేర్లు ఉంటే వెంటనే రిపేరు చేయించి నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. ఏఏ గ్రామాలలో బోర్ వెల్ రిపేర్ చేయాల్సినవి గాని ఉన్నట్లయితే వాటి వివరాలను పంపాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా తాహసిల్దార్ కార్యాలయంలో నీటి ట్యాంకు మరియు గణపవరం రోడ్ వెంట ఉన్న నీటి ట్యాంకును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి ఆంజనేయులు, ఎంపీఓ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- బెజవాడ గోవర్ధన్

**మునగాల, విశాలభారతి:** మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ జిల్లా నాయకులు బెజవాడ గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీసీ కులాల్లో సంఘాల కి మరియు ఓసి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభసూచికం అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కులవృత్తి పై జీవిస్తున్న నాయి బ్రాహ్మణుల కి కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా రాజకీయంగా ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు భారీని నీటి పారుదల శాఖ మరియు పౌరసరఫరాల శాఖ మహత్యులు ఉత్తంకుమార్ రెడ్డికి కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి కి మరియుమంత్రి మండల కి ఆయన విజ్ఞప్తి చేశారు.






# అడవులను నాశనం చేస్తే మన ఉనికికే ప్రమాదం

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని

**పినపాక, విశాలభారతి :** అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తే మన ఉనికిని మనమే ప్రశ్నార్థకం చేసుకున్నట్టని పినపాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని అవగాహన కల్పించారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా అడవి శాఖ కార్యాలయం నుండి ఈ బయ్యారం వరకు సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే అడవులను వారసత్వంగా వారికి అందించాల్సిన ఆవశ్యకత మనపైన ఉన్నదన్నారు. తగ్గిపోతున్న అడవులను కాపాడే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సకాలంలో వర్షాలు పడాలన్న వాతావరణంలో కాలుష్యం ఏర్పడకుండా వుండాలన్న వాతావరణ సమతుల్యత కాపాడుకోవాలంటే అడవులే కీలకం అని పిలుపునిచ్చారు. అడవులతోనే మానవుల మనుగడ అని అందరికి తెలిసినా అడవుల రక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పర్యావరణ సమస్యలు ఉత్పనం అవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ఇంటి ముందు సైతం రెండు మొక్కలు నాటాలని, నాటడమే గాక సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఓ అరుణ, అటవి శాఖ అధికారులు పాల్గొన్నారు



# ఎన్నికల దృష్ట్యా పటిష్ట నిఘా ఉంచాలి

- గతంలో ఎన్నికల్లో కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేయాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే

**సూర్యాపేట, విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు వెంట పటిష్ట నిఘా ఉంచాలని, గతంలో ఎన్నికల్లో కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం నందు అదనపు ఎస్పి నాగేశ్వర రావుతో కలిసి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే కోదాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఎస్ పి మాట్లాడుతూ పెండింగ్ కేసులు వేగంగా దర్యాప్తు చేసి ఛార్జ్ షీట్ త్వరగా కోర్టులకు పంపించాలని , ఎన్ఫోర్స్మెంట్ పటిష్టంగా చేయాలnని కేసు ఆధారాలుగా టెక్నికల్ ఆధారాలను రికార్డ్ చేసుకోవాలని, దొంగతనం కేసులు త్వరగా చేదించాలని ఎస్పి అధికారులకు సూచించారు. గంజాయి కేసుల నమోదు, సైబర్ నేరాల నమోదు రికవరీ లలో ప్రణాళిక ప్రకారం పని చేయాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను చైతన్య పరచాలి అన్నారు.ఈ సంద్భంగా ఎస్పి రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఎన్నికల వేళ జిల్లా సరిహద్దు వెంట అక్రమ రవాణా,అక్రమ కార్యకలాపాలు జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలని , క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించి జిల్లాలోకి అక్రమ సరఫరా లేకుండా నిరోధించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర శాఖా సిబ్బందితో సమన్వయముతో టీమ్స్ వర్క్ చేయాలని అన్నారు. డయల్ 100 పిర్యాదుల పై స్పందన వేగంగా ఉండాలని బ్లూ కొట్స్ సిబ్బంది విధులు సమర్ధంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో కోదాడ సబ్ డివిజన్ డిఎస్పీ శ్రీధర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మట్టయ్య, సైబర్ సెక్యూరిటీ డిఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ పాండరి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ జితేందర్ రెడ్డి, సిఐ లు చరమంద రాజు,రజిత రెడ్డి, రాము, రామకృష్ణా రెడ్డి, లక్ష్మినారాయణ, డిసిఆర్బి ఐటి కోర్ ఎస్ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**వాజేడు, విశాలభారతి:** వేసవి కాలంలో ప్రతి ఇంటికి త్రాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ తో కలిసి త్రాగు నీటి సరఫరా పై మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ఎద్దడి సమస్య ఉన్నా గ్రామాలను గుర్తించి ప్రతి ఇంటికి నీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాలలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని రాబోయే మూడు నెలల లో గ్రామాలలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు అందించాలని అన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాలలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని, అటవీ ప్రాంతంలో ఉండే గిరిజనులకు గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని అందించాలని, అధికారులు గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని , గ్రామాలలో ఉండే బోర్ వెల్స్ , హ్యాండ్ పంప్స్ పనితీరు పరిశీలించాలని పనిచేయని బోర్వెల్స్ హ్యాండ్ పంప్స్ ను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్పిడీసీఎల్ డిఈ నాగేశ్వరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఈ మల్లేశం, డిసిఓ సర్దార్ సింఘ్, యంపిడిఓ విజయ, గ్రామ పంచాయితిల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily


# ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రాణాలు పదిలం

- నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి గాండ్ల శంకర్ రాజు
- నిజాం కాలేజీ లో అవగాహన సదస్సు




**విశాలభారతి,హైదరాబాద్:** రోడ్డు భద్రత అవగాహనపై నిజాం కళాశాలలో సదస్సు ట్రాఫిక్ రూల్స్ పాటించడంతోనే ప్రాణాలు పదిలంగా ఉంటాయని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి గాండ్ల శంకర్ రాజు పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, ట్రాఫిక్ పోలీస్ రోడ్డు రవాణా శాఖ లతో కలిసి నేషనల్ సర్వీస్ స్కీమ్( ఎన్ ఎస్ ఎస్) సంయుక్తంగా నిజాం కళాశాలలో గురువారం " రోడ్డు భద్రత అవగాహన ట్రాఫిక్ రూల్స్" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి .బీమా అధ్యక్షత వహించారు. సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి గాండ్ల శంకర్ రాజు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ప్రతి ఏటా వేలాదిమంది తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తికి ప్రాణం ఎంతో విలువైనదని, ప్రాణం విలువ తెలుసుకొని నియమ నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తి మరణిస్తే వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోతారనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. కుటుంబ పోషణకు ఆధారమైన వ్యక్తి చనిపోతే వారి భార్యా , పిల్లలు భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంద నే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తమ ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను హరించకుండా ఉండాలంటే ట్రాఫిక్ రూల్స్ పాటించడంతోనే సాధ్యమవుతుందన్నారు. అలాగే ఆసుపత్రుల పాలు కాకుండా, అవస్థల పాలు కాకుండా ఉండాలంటే రోడ్డు భద్రతను అవగాహన చేసుకుని మసలుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై కొన్ని వీడియోలను , చిత్రాలను నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి గాండ్ల శంకర్ రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు చూపించారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. బీమా మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ముఖ్యంగా యువతరం, విద్యార్థులు అవగాహన చేసుకుని ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. అలాగే సమాజంలో ట్రాఫిక్ రూల్స్ రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు తమ వంతు పాత్రను పోషించాలని ఆయన విద్యార్థులను కోరారు. నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఏ ఆర్ విజయ రావు మాట్లాడుతూ యువత, విద్యార్థులు దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో యువత అత్యధికంగా మరణిస్తున్నారు అని ఈ మరణాల సంఖ్య తగ్గాలంటే యువత విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఉపేందర్ రెడ్డి, ఆబిడ్స్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ రవి, ఎన్ఎస్ఎస్ నిజాం కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజుల, సుదర్శన్, స్టూడెంట్స్ అడ్వైజర్ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వమే ప్రజలను మోసం చేసింది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి డిమాండ్

**సూర్యాపేట, విశాలభారతి**: ప్రభుత్వమే మాట ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘటన చరిత్రలో ఏనాడు లేదని, మాట ఇచ్చి రైతన్నల నడ్డి విరిచిన అపకీర్తి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని మండిపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అవగాహన లోపంతో ఎండిపోయిన పంటలను వరసగా 5వ రోజు జగదీష్ రెడ్డి పరిశీలించారు. ఎండిపోయిన పంటలను పరిశీలించాలని రైతన్నల కన్నీటి ఆహ్వానం మేరకు సూర్యాపేట మండలం యార్కారం,దుబ్బ తండ , రెఖ్యా నాయక్ తండాలో ఎండిన పొలాల పరిశీలించిన ఆయన రైతుల ఇబ్బందులను చూసి చలించి పోయారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగదీష్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎస్సారెస్పీ ఫేస్ 2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే పంటలు వేశారని, హామీ ఇచ్చి పంటలకు నీరు ఇవ్వకుండా కాంగ్రెస్ రైతాంగాన్ని మోసం చేసింది దని విరుచుకుపడ్డారు. ప్రభుత్వాన్ని నమ్మి ఒక్కో రైతు 25 నుండి 30 వేల పెట్టుబడి పెట్టి ఆగమయ్యారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసి జీడీ భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బొడ్డు కిరణ్, పల్స లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## పద్ధతి మార్చుకోక పోతే వేటు తప్పదు

- డిపిఓ స్వరూప పై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం

**వాజేడు, విశాలభారతి**: ములుగు జిల్లా వాజేడు మండలం కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో త్రాగునీటి సరఫరా సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ ములుగు డిపిఓ స్వరూప పై ఆగ్రహం వ్యక్తం చేశారు ఒక ఐఏఎస్ అధికారి పేరు చెప్పి పంచాయితీ కార్యదర్శుల దగ్గర వసూళ్లకు పాల్పడడం సరైన పద్ధతి కాదు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్షణమే ఈ సమావేశ హాలు నుండి బయటికి వెళ్లిపోవాలని ఆదేశించడంతో డిపిఓ స్వరూప అక్కడి నుండి బయటకు వెళ్లిపోయారు పంచాయతీ కార్యదర్శులు గాని ఇతర ఏ అధికారులైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం

**భద్రాచలం, విశాలభారతి**: రైతువేదికలో దుమ్ముగూడెం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ పిఓ నవ్యశ్రీ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నవ్య శ్రీ మాట్లాడుతూ.. తల్లులకు చిరుధాన్యల వల్ల అందె పోషక విలువలను తెలియజేశారు. ప్రతి ఒక్కరు చిరుధాన్యలను తప్పనిసరిగా స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. పిల్లలు అనారోగ్యనికి గురి కాకుండా ఉండాలంటే ఎటువంటి ఆహారం తీసుకోవాలి అని వివరించారు. తల్లి పాలలో ఉండే పోషకవిలువలని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తల్లిపాలే పిల్లలకు శ్రీరామరక్షని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైసర్ సావిత్రి, టీ ,మణి, సుభద్ర, తెల్లం కళావతి, గుండి తిరుపతమ్మ, కార్యకర్తలు, ఆయలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## యువత స్వశక్తితో ఎదగాలి

**చిట్యాల, విశాలభారతి:** యువత స్వశక్తితో ఎదిగి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి 65 పక్కన వై. లింగస్వామి, నవీన్ లు నూతనంగా ఏర్పాటు చేసిన మద్రాస్ ఫిల్టర్ కాఫీ సెంటర్ ని ఎమ్మెల్యే వేముల ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత స్వశక్తితో ఉపాధవకాశాల్ని పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేలా కష్టపడాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపాలిటీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుమ్మల మోహన్ రెడ్డి,నల్లగొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, చిట్యాల,నార్కట్ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు లక్ష్మీ నరసింహ, బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్ రెడ్డి, ఆవుల యాదయ్య, కౌన్సిలర్లు పలు గ్రామాల సర్పంచులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ

**వాజేడు, విశాలభారతి**: మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో నిర్వహించు సేవలపై డాక్టర్ మహేందర్ వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గదిని అందులో అత్యవసర మందుల నిలువలను లభ్యంగా ఉన్నాయా పరిశీలించారు. తదుపరి ఫిమేల్ వార్డును సందర్శించి, రోగులు అడ్మిట్ అయి చికిత్స పొందుతున్న వారితో ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సమయంలో ఒక గర్భిణీ స్త్రీ కూడా కాన్పు కొరకు వార్డులో చికిత్సలో ఉన్నారు. అనంతరము ఫార్మసీ స్టోర్ ను సందర్శించి, ఫార్మసీలో మందుల స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి, అత్యవసరమైన డ్రగ్స్ ను సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుండి సమకూర్చుకోవాలని , మందుల కొరత రాకుండా నిర్వహించుకోవాలని సూచించారు.



## ముమ్మరంగా వాహన తనిఖీలు

**గరిడేపల్లి, విశాలభారతి**: మండల కేంద్రం హుజూర్నగర్ మిర్యాలగూడ జాతీయా రహదారిపై వాహన తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా గురువారం గరిడేపల్లి చేపల మార్కెట్ పరిసర ప్రాంతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఫ్లయింగ్ స్క్వాడ్ స్పెషల్ అధికారి స్రవంతి, హెడ్ కానిస్టేబుల్ అక్బర్అలీ, కానిస్టేబుళ్లు నరేష్, నాగేశ్వరరావు, కెమెరామెన్ తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారంతో రక్తహీతనకు చెక్

- ప్రతి గర్భిణి నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత

**మరిపెడ, విశాలభారతి**: పోషకాహారంతోనే తల్లి బిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అంగన్వాడి ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత, అంగన్వాడి టీచర్ జ్యోతి అన్నారు. బుధవారం మరిపెడ మండలం ఎల్లంపేట సెక్టార్ లోని స్టేజి తండా గ్రామపంచాయతీలో అంగన్వాడి కేంద్రం కుడియా తండ అంగన్వాడి సెంటర్ల లో పోషణ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల, కలిగే లాభాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారంతోనే సాధ్య మన్నారు.పోషక విలువలతో కూడిన ఆహారాన్ని స్వీక రించడం వల్లనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.గర్భిణులు, బాలింతలు,చిన్నారులు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారంతోనే మహిళల్లో, పిల్లల్లో రక్తహీనత బెడద తొలగుతుందని,ఆహార నియామాల్లో అధికంగా చిరు ధాన్యాలైన రాగులు, సజ్జ లు, జోన్నలు, పెసర, సామలు, కొర్రలు తదితర వాటిని ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అదే విధంగా పోషక విలువలు అధికంగా ఉండే పాలు,గుడ్లు,పప్పు దినుసులు, తాజా ఆకుకూరలు, పండ్లు తదితర వాటిని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జ్యోతి, శ్రీలత, పద్మ, అంగన్వాడి ఆయాలు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రధమ ద్వితీయ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిసి జయశ్రీ గార్డెన్లో వీడికో సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సెక్రటరీ ఎం సుభాష్ రెడ్డి, మరియు కళాశాల డైరెక్టర్ ఎం శ్రావణి హాజరైనారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎం సుభాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని విజ్ఞానాన్ని వెలికితీస్తూ లక్ష సాధన వైపు అడుగులు వేస్తూ ఉన్నత శిఖరాలు చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. తదనంతరంనిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థుల ఆటపాటలతో అలరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి మహేందర్ రెడ్డి అధ్యాపక బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా అధ్యయనోత్సవాలు

**సూర్యాపేట, విశాలభారతి**: సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో గురువారం రెండవ రోజు అధ్యయనోత్సవాలు ఘనంగా కొనసాగాయి. యజ్ఞాచార్యులు మరింగంటి వరదా చార్యుల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రభందసేవాకాలం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజబాబు రెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాదరావు, అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్, కుమ్మరికుంట్ల జానయ్య, చెరుకుపల్లి సైదమ్మ, గంపల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ ఎక్కి నిరసన

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా తిరిగి నియమించాలని నిరసన



**దేవరుప్పుల, విశాలభారతి**: పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ను దేవరుప్పుల మండల అధ్యక్షుడిగా నియమించేంతవరకు సెల్ టవర్ దిగనని డిమాండ్. పార్టీకోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ను కాదని నల్ల శ్రీరామ్ ను నియమించడం సరికాదు.
తక్షణమే పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఝాన్సి రెడ్డి వచ్చి మళ్ళీ కృష్ణమూర్తినే నియమిస్తామని చెబితేనే ఇక్కడినుంచి దిగుతా లేకుంటే ఇక్కడి నుంచి దూకేస్తానని డిమాండ్. సంఘటన స్థలానికి ఎస్సై చెన్నకేశవులు,సిబ్బంది హుటాహుటిన చేరుకొని ఎమ్మెల్యేతో మాట్లాడిస్తానని వెంటనే దిగాలని కోరిన ఎస్సై. మాట్లాడిన తర్వాతే కిందికి దిగుతానని ఉప్పుల బాబు భీష్మించుకొని కూర్చున్నాడు.



## నూతన అధ్యక్షుడుని సన్మానించిన మండల బిసిసెల్ అధ్యక్షుడు

**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా నల్ల శ్రీరామ్ నియామకమైన సందర్భంగా దేవరుప్పుల మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు అధ్యక్షతన మండలకేంద్రంలోని అక్షర గార్డెన్ లో ఏర్పాటు చేసిన అభినందనసభలో శాలువాతో సన్మానించిన మండల బిసిసెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేశ్.పాల్గొన్న దేవరుప్పుల మండల సీనియర్ నాయకులు కాసారపు ధర్నారెడ్డి, ఉప్పుల సురేష్ బాబు, ఓడపెల్లి రవీందర్, తోటకూరి పాండు కృష్ణ,నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు ధరావత్ రాజేశ్ నాయక్,ఆవుల సురంజన్ రెడ్డి,రెడ్డి రాజుల రమేశ్,మహ్మద్ రసూల్,తదితరులు ఉన్నారు.



# ఘనంగా శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కూకట్ పల్లి, విశాలభారతి** : శేర్లింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి కంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బస్తివాసులు హాజరై శ్రీధర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పూలమాలతో సన్మానించి, కేకు కట్ చేసీ శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని వేడుకుంటున్నామని అన్నారు. రాజకీయపరంగా మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాపి రెడ్డి నగర్ బస్తి వాసులు , కూకట్పల్లి డివిజన్ సీనియర్ నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రంజిత్ రెడ్డి కి శుభాకాంక్షలు

- **దొడ్ల రామకృష్ణ గౌడ్**

**కూకట్ పల్లి, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అధిష్టానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంజిత్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సందర్భంగా గురువారం ఆల్విన్ కాలనీ డివిజన్ యువ నాయకులు దొడ్ల రామ కృష్ణ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మేరకు రంజిత్ రెడ్డిని అంత్యత భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంటులో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించాలని కోరారు.





# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి**:ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేయాలని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి తుర్కయంజాల్ రాగన్నగూడలో నూతనంగా నిర్మించిన క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ మీడియా సంస్థ భవనాన్ని ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, బాలునాయక్ తో కలిసి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ సంచలనాల కోసం పోటి పడి వార్తలు రాస్తే ప్రజల్లో చులకన భావం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. జర్నలిస్టులు తమ కర్తవ్యాన్ని, చిత్తశుద్ధితో అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ, యూసుఫ్ బాబు, క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ మీడియా అధినేత ఎన్. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొశికే ఐలయ్య, మేతరి అనురాధ దర్శన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లక్ష్మీనరసింహ దేవాలయం సందర్శన

- **మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే భూపతిరెడ్డి**

**ధర్పల్లి, విశాల భారతి:**నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో నాడు జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనసభ్యులు డాక్టర్.ఆర్.భూపతి రెడ్డి కలిసి గురువారం సిరికొండ మండలం ఆయా గ్రామాలలో ఇటీవల కురిసిన అకాల వడగళ్ళ వాన వలన పంట నష్టం జరిగిన రైతుల పంటపొలాలను సందర్శించి, వారిని పరమర్శించడానికి వెళ్తున్న సమయంలో ధర్పల్లి మండలం మద్దుల్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సందర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమిక్ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ధర్పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్, మనోహర్ రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సైని సన్మానించిన వీడిసి సభ్యులు

**ధర్పల్లి, విశాల భారతి:**ధర్పల్లి ఎస్సైగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సై భూపల్లి విక్రమ్ ను గోవింద్ పల్లి విడిసి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ పల్లి గ్రామ విడిసీ సభ్యులు గోలెం గంగదాసు ,సాయిలు, కనకం నర్సయ్య,చిన్నయ్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.





# వాతవరణ మార్పు ఎన్నికల ప్రచారాంశం కావాలి

- **గీతం అతిథ్య ఉపన్యాసంలో అభిలషించిన ఐఐటీ బొంబాయి ప్రొఫెసర్ డి.పార్థసారథి**

**పటాన్ చెరు,విశాలభారతి:** మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల వల్ల ప్రకృతిలో ప్రమాదకరమైన మార్పులు సంభవిస్తున్నాయని, అది ఎన్నికల ప్రచారాంశం కావాలని ఐఐటీ బొంబాయి లోని హ్యుమానిటీస్ అండ్ సోషల్ సెన్సెస్ ప్రొఫెసర్ డి.పార్థసారథి అభిలషించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సెన్సెస్ లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు, ప్రజా సమూహాలు, ఎన్నికలు' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను, కష్టాలను ఎన్నికల సమస్యగా సాధారణ ప్రజలు ఎందుకు లేవనెత్తడం లేదో అర్థం చేసుకోవడానికి ఈ చర్చ కొనసాగించారు. యువతలో వాతావరణంపై అవగాహనను పెంచే సందర్భంలో వాతావరణ న్యాయం యొక్క అర్థం, ఆవశ్యకతపై డాక్టర్ పార్థసారథి అవగాహన కల్పించారు. ప్రపంచ సహకారం, ప్రాంతీయ ఒప్పందాలు, స్థానిక క్రియాశీలతను ప్రోత్సహించడంపై దృష్టి సారించే కొత్త విధానాన్ని ఆయన ప్రతిపాదించారు. ప్రస్తుతం నిపుణుల చర్చలు, శాస్త్రీయ చర్చలకు పరిమితమైన రోజువారీ సంభాషణలలో వాతావరణ మార్పులను భాగం చేయవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. తొలుత, జీఎస్ఏహెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోప్మాన్ జోస్ అతిథిని ఆహ్వానించి, సత్కరించారు. సోషియాలజీ విభాగం సమన్వయకర్త డాక్టర్ అవినాష్ అతిథి స్వాగతించగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రోమా భట్టాచార్య నందన సమర్పణ చేశారు. సామాజిక, పర్యావరణ సమస్యలను ఎత్తిచూపి, సానుకూల మార్పును తీసుకురావడానికి నిపుణులను ఒకచోట చేర్చి, ఆయా అంశాలపై చర్చలను జీఎస్ హెచ్ఎస్ నిర్వహిస్తోంది.



# ఎన్నికల ముందు వచ్చిన వలస పక్షులు గడ్డం వివేక్, వినోద్, వంశి

- **పెద్దపల్లి పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**

**మంచిర్యాల, విశాల భారతి:**లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మూడు మున్సిపాలిటీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా, విద్యార్థి యువజన, టీబీజీకేఎస్ ముఖ్య నాయకులతో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంటరీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చెన్నూరు మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై, ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలపై కార్యకర్తలకు నాయకులు దిశా నిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి ఈశ్వరనన్ను భారీ మెజారిటీతో గెలిపించాలి. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు వచ్చిన వలస పక్షులు గడ్డం వివేక్, వినోద్, వంశి అని అన్నారు. తెలంగాణ కేసీఆర్ పాలనలో దేశంలోనే నెంబర్ వన్ లో నిలిపి రాష్ట్ర రూపు రేఖలు మార్చారు అని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఐటీ రంగంలో పరిశ్రమలకు 4 వందల కోట్లు పెట్టుబడులు కెటిఆర్ తెచ్చారు.

అలాగే 18 లక్షల మందికి ఐటి రంగంలో ఉద్యోగాలు కేటీఆర్ హయాంలో ఇవ్వడం జరిగిందని అన్నారు. చెన్నూర్ లో 1600 కోట్ల రూపాయల పనులను రద్దు చేశారు అని అన్నారు. అలాగే మూడు మున్సిపాలిటీలో 100 కోట్ల పనులు నిలిపివేశారు అన్నారు. కారు గుర్తుకే ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలి అని కొప్పుల ఈశ్వర్ ప్రజలను కోరారు.



# ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

- **ఉచితంగా ఐవిఎఫ్ పరీక్షలు**

**ధర్పల్లి, విశాల భారతి:**ధర్పల్లి మండల కేంద్రంలో నక్షత్ర హాస్పిటల్ నందు శుక్రవారం అనగా ఈ రోజు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నక్షత్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు హైదరాబాద్ నుండి వస్తున్న డాక్టర్స్ ఉచితంగా ఐవిఎఫ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ధర్పల్లి మండలం చుట్టుపక్క గ్రామాల ప్రజలందరూ ఉపయోగించుకోవాలని డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒకరు ఉపయోగించుకోవాలని ప్రజలకు కోరారు.



# దేవాలయం నిర్మాణ పనులు పరిశీలన

- **మాజీ మంత్రి..**

**వనపర్తి, విశాల భారతి:** జిల్లా కేంద్రంలోని పాత బజార్ లో గల ప్రధాన రోడ్డు విస్తరణలో బాగంగా వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని నిర్మిస్తున్న దేవాలయం పనులను బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీమంత్రి నిరంజన్ రెడ్డి గురువారం పరిశీలించారు. గతంలో ఈ గుడి నిర్మాణం కోసం తన సొంత డబ్బులు 5లక్షలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పనులు వేగవంతం చేసి దేవాలయాన్ని ఆధునికరంగా నిర్మించాలన్నారు. అనంతరం పాత బజార్ లోని కొలువుదీరిన కాళికామాత దేవి దర్శనం చేసుకొని మొక్కు తీర్చుకున్నారు. అలాగే దేవాలయాల నిర్మాణం కోసం ఆర్థిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నిరంజన్ రెడ్డి వెంట నీల స్వామీ, ఎర్ర శ్రీను, నందిమల్ల అశోక్, బాలస్వామి, రామస్వామి, రవి తదితరులు ఉన్నారు.



# ఘనంగా చందా సాహితి జన్మదిన వేడుకలు

- **మండల కేంద్రంలో అన్నదానం**

**సైదాపూర్, విశాల భారతి:**కరీంనగర్ జిల్లా సైదాపూర్ సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చందా శ్రీనివాస్ కూతురు చందా సాహితి జన్మదిన వేడుకలను సైదాపూర్ మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చందా శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు స్వీట్లు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెన్నంపల్లి సింగిల్ విండో చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి, వెన్కేపల్లి ఎంపిటిసి సభ్యుడు జంపాల సంతోష్ లు మాట్లాడుతూ చందా సాహితీ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కామినేని వీరేశం, దుద్దెనపల్లి మాజీ సర్పంచ్ తాటిపల్లి యుగంధర్ రెడ్డి,తాటిపెల్లి జితేందర్ రెడ్డి,నెల్లి పోచయ్య,మాజీవార్డు మెంబర్ పోశెట్టి అజయ్,పోశెట్టి నరేష్,గుల్ల శ్రీకాంత్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

- **పెద్ద ఎత్తున హాజరైన భక్తులు**

**సైదాపూర్, విశాల భారతి:**మొక్కిన మొక్కులు వెంటనే తీర్చే స్వామి వారిగా పేరుగాంచిన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి కల్యాణంను ఆలయ ఆర్చకులు చక్రపాణీ వెంకటాచార్యులు, చక్రపాణి లక్ష్మి నారహరి చార్యులు, చక్రపాణీ శ్రీనివాసాచార్యులు, రవీంద్రాచార్యులు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమలను పూలమాలలతో అందంగా అలంకిరించి కల్యాణానికి ముస్తాబు చేశారు. ఎక్లాస్ పూర్ గ్రామ ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున హజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ధర్మకర్తలు మురళీమనోహార్ రావు, ప్రముఖ న్యాయవాధి వేముగంటి జగదీశ్ చందర్ రావు, సహకార సంఘాల జిల్లా అధ్యక్షులు కొత్త తిరుపతి రెడ్డి తదతరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద్భరంగా వారు మాట్లాడుతూ వచ్చె సంవత్సరం ఆలయ శత వసంత్సోవాల సందర్భంగా బ్రహోత్సవాలను అందరి సహాకారంతో ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 25న స్వామి వారు రథోత్సవంపై ఊరేగుతారని చెప్పారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున మహా అన్నదానంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముగంటి మురళి మనోహర్ రావు, జగదీష్ చందర్ రావు, వెంకటేశ్వర్ రావు, గ్రామపంచాయితీ కార్యదర్శులు హైమా, పోరెడ్డి నరెందర్ రెడ్డి, గ్రామ పంచాయితీ కారోబార్ నర్సింగోజు శ్రీనివాస్ భక్తులు గంగిళ్ళ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల డిమాండ్స్ డే విజయవంతం చేద్దాం

- **టియుడబ్ల్యూ(ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శ**

**వనపర్తి, విశాల భారతి:**జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తూ, మీడియా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, జర్నలిస్టు డిమాండ్స్ డే ను విజయవంతం చేయాలని టియుడబ్ల్యూ (ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి. మాధవరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షహీద్ భగత్ సింగ్ వర్ధంతిన రేపు దేశ వ్యాప్తంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు) ఇచ్చిన 'జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే' పిలుపును రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లా కేంద్రాల్లో విజయవంతంగా నిర్వహించాలని, టీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ తెలిపిందన్నారు. రేపు వనపర్తి జిల్లా కేంద్రం లోని రాజీవ్ చౌరస్తాలో ఉదయం 9.30 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని , జిల్లా కేంద్రంలోని



జర్నలిస్టులతో పాటు అన్ని మండలాల్లోని జర్నలిస్టులు అందరూ సకాలంలో జిల్లా కేంద్రానికి చేరుకోవాలని కోరారు. జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల వర్గాలకు, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు వినతి పత్రాలను అందించాలన్నారు.

# భీమ్‌గల్ ఎస్సైపై సిపికి ఫిర్యాదు

**బాల్కొండ, విశాల భారతి:**బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ ఎస్సై హరిబాబు తనపై వ్యవరించిన తీరుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిజమాబాద్ సిపి కి ఫిర్యాదు చేసినట్లు భీమ్‌గల్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పర్స నవీన్ తెలిపారు. తన అత్తమ్మ కేస్ విషయంలో పోలీస్ స్టేషన్ కి దొనకంటి నర్సయ్య, మూత లింబాద్రితో కలిసి వెళ్ళడం జరిగిందని కేసు రిసిప్ట్ ఇవ్వాలని కోరగా ఇస్తే ఎం చేస్తావ్ అని కోపగ్రస్తులై గెట్ అవుట్ అంటూ బూతులు తిడుతూ తన కాలర్ పట్టుకొని వేరే గదిలోకి తీసుకెళ్లడం జరిగిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తను ఒక దళిత ప్రజా ప్రతినిధిని అని చెప్పిన కూడా వినకుండా నాన్ బెయిల్ కేస్ పెట్టిస్తా అన్నారని తెలిపారు. తనను అందరు ముందు అవమానించారాని, స్టేషన్ లో ఉన్న సిసి కెమెరాలు పరిశీలించి ఎస్సై హరి బాబు పై చర్యలు తీసుకొని తనకి న్యాయం చెయ్యాలని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily


# ఇన్‌స్టా రికార్డుల్లో కూడా తగ్గేదేలే.. అల్లు అర్జున్



ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్ ఫాలోయింగ్, ఆయనకున్న క్రేజ్ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పుష్ప చిత్రంతో అంతర్జాతీయంగా అభిమానులను సంపాందించుకున్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ రోజు రోజుకు తన పాపులారిటీని పెంచుకుంటూనే పోతున్నాడు. ప్రతి విషయంలో తనకంటూ ఒక బలమైన మార్క్‌ను క్రియేట్ చేసుకంటున్నాడు. ఇటీవల ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డ్‌తో అందుకున్న తొలి తెలుగు హీరోగా రికార్డ్ క్రియేట్ చేసిన అల్లు అర్జున్ అన్ని విషయాల్లోనూ అందర్ని దాటి ముందుకు దూసుక వెళ్తున్నాడు. తాజాగా తన సోషల్ మీడియా ఇన్‌స్టా అకౌంట్ ఫాలోవర్స్ విషయంలో ఐకాన్‌స్టార్ కొత్త రికార్డును నెలకొల్పాడు. అల్లు అర్జున్ ఇన్‌స్టా అకౌంట్‌ను కోట్ల మంది ఫాలో అవుతున్నాడు. ఇన్‌స్టాలో ఎప్పుడూ యాక్టివ్‌గా వుండే ఈ ఐకాన్‌స్టార్ 25 మిలియన్ల ఫాలోవర్స్ ను చేరుకున్నాడు. ఇన్‌స్టాలో ఇంత మంది ఫాలోవర్స్ వున్న మొదటి సౌత్ హీరో అల్లు అర్జున్ కావడం విశేషం. ఈ విషయాన్ని ఐకాన్‌స్టార్ తన అకౌంట్ లో తెలుపుతూ మీ అభిమానానికి ఎప్పటికి థ్యాంక్స్ అంటూ పోస్ట్‌ను పెట్టాడు. ఇక ఈ విషయంలో తమ హీరో క్రియేట్ చేసిన రికార్డు విషయంలో ఐకాన్‌స్టార్ అభిమానులు ఫుల్ ఖుషీలో వున్నారు. అంతేకాదు అల్లు అర్జున్ నటిస్తున్న తాజా చిత్రం పుష్ప ది రూల్ (పుష్ప 2) ఎన్ని రికార్డులు క్రియేట్ చేయనుందో అంటూ లెక్కలేసుకుంటున్నారు ఐకాన్‌స్టార్ అభిమానులు.

# విశ్వంభర
## హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ మాగ్నమ్ ఓపస్ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను చిత్ర బృందం పూర్తి చేసుకుంది. చిరంజీవి, త్రిష కృష్ణన్ తదితరులు షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని టాకీ పార్ట్స్ , పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించారు. చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా మొత్తం బృందంతో పాటు త్రిష కృష్ణన్ కొన్ని ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేశారు. "ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు! #విశ్వంభర" అని ఆమె పోస్ట్ చేశారు. చిరంజీవి, త్రిష, వశిష్ట, కీరవాణి, విక్రమ్, వంశీ, ఛోటా కె నాయుడు, ఎఎస్ ప్రకాష్ కనిపిస్తున్న మరో పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రిచ్ ప్రొడక్షన్, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో అద్భుతంగా వుండబోతోంది. కోటగిరి వెంకటేశ్వరరావు, సంతోష్ కామిరెడ్డి ఈ చిత్రానికి ఎడిటర్‌లుగా వ్యవహరిస్తున్నారు. శ్రీ శివశక్తి దత్తా, చంద్రబోస్ లిరిక్ రైట్స్ కాగా, శ్రీనివాస్ గవిరెడ్డి, గంటా శ్రీధర్, నిమ్మగడ్డ శ్రీకాంత్, మయూఖ్ ఆదిత్య స్క్రిప్ట్ అసోసియేట్‌లుగా ఉన్నారు.



## ధనుష్ ప్రధాన పాత్రలో మ్యాస్ట్రో ఇసైజ్ఞాని
# 'ఇళయరాజా' బయోపిక్

మాస్ట్రో, ఇసైజ్ఞానిగా ప్రేక్షకులను తన సంగీత స్వర సాగరంలో ముంచెత్తిన ఇళయరాజా అభిమానులు ఎంతో సంబరపడుతున్నారు. అందుకు కారణం చాలా రోజుల నుంచి వారు ఆయన ఇళయరాజా బయోపిక్ ఎప్పుడు ప్రారంభమవుతుందా! అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు మ్యాస్ట్రో బయోపిక్ 'ఇళయరాజా' పేరుతో బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. ఈ వేడుకకు యూనివర్సల్ హీరో కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌ను గమనిస్తే ఇళయ రాజా మూర్తీభవించిన రెట్రో లుక్‌లో ధనుష్ కనిపిస్తున్నారు. కెప్టెన్ మిల్లర్ సినిమాతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ ఈ బయోపిక్‌ను డైరెక్ట్ చేస్తున్నారు. కనెక్ట్ మీడియా, పి.కె. ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యురీ మూవీస్ బ్యానర్స్‌పై శ్రీరామ్ భక్తిశరణ్, సి.కె.పద్మకుమార్, వరుణ్ మాథుర్, ఇలం పరితి గజేంద్రన్, సౌరభ్ మిశ్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె.నిరవ్ షా సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి ముత్తురాజ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ మ్యాస్ట్రో ఇసైజ్ఞాని ఇళయరాజా కూడా పాల్గొన్నారు. ఇంకా డైరెక్టర్ వెట్రిమారన్, త్యాగరాజన్ కుమారరాజా సహా పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ "చిన్నప్పటి నుంచి నేను మాస్ట్రో ఇళయరాజాగారు అందించిన అద్భుతమైన మెలోడి పాటలను విని మైమరచిపోయేవాడిని. ఇప్పుడు ఆయన బయోపిక్ చేస్తుండటం చూస్తుంటే కల నిజమైనట్లు అనిపిస్తుంది. నా జీవితంలో మరచిపోలేని క్షణాలవి. మనం మనసులో బలంగా కోరుకుంటే అవి నిజమవుతాయని అంటుంటాం. ఈ సినిమాలో ఆయన పాత్రను పోషించే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఈ సందర్భంలో ఇళయరాజాగారికి నిజమైన ఆరాధకుడు, గౌరవనీయులైన కమల్ హాసన్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది ప్రేమ, కళాత్మకతను జోడించాల్సిన సమయం. దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ ఓ గొప్ప బాధ్యతను స్వీకరించారు. ఈ ప్రయాణంలో ప్రతీ క్షణాన్ని తను ఆస్వాదించాలని నేను కోరుకుంటున్నాను. ఆ దిశగా తనకు నేను తోడ్పాటు అందిస్తాను అన్నారు.

# లెదర్ ఫ్రాక్‌లో ప్రగ్యా



ప్రగ్యా జైశ్వాల్ టాలీవుడ్ జర్నీ గురించి తెలిసిందే. `మిర్చి లాంటి కుర్రాడు` నుంచి `సన్నాఫ్ ఇండియా` వరకూ పడతా లేస్తా సినిమాలు చేసింది. అంతకు ముందే కోలీవుడ్ లో ఎంట్రీ.. ఆ తర్వాత బాలీవుడ్ లోనూ లాంచ్ అయింది. ఈ రెండు భాషలకంటే బెటర్ గా తెలుగు లోనే సినిమాలు చేసింది. ఇక్కడ కూడా కెరీర్ చరమాంకానికి చేరుకోవడం తో పాటు తమిళ్..హిందీ భాషల్లో కూడా అవకాశాలు రాకపోవడంతో ఇక పరిశ్రమ నుంచి ఎగ్జిట్ అవ్వాల్సిందే అన్న విమర్శలు ఎదుర్కుంది. గత ఏడాది పూర్తిగా ఖళీగానే కనిపించింది. కానీ అమ్మడు మాత్రం ప్రయత్నాలు ఏనాడు ఆపలేదు. అభిమానులకు నిరంతరం ఇన్ స్టా ద్వారా టచ్ లో నే ఉంటుంది. హాట్ ఫోటోలతో అలరించే ప్రయత్నంలో కొంత వరకూ సక్సెస్ అయింది. అవకాశాలు లేవు అనే మాట తప్ప! అభిమానుల్లోనే ఉన్నాను అనే పాజిటివ్ సైన్ తో ముందుకెళ్తుంది. తాజాగా సొగసరి మరో హాట్ ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా గోల్డ్ కలర్ ఔట్ ఫిట్ లో అమ్మడు తళతళ లాడిపోతుంది. లెదర్ ఫ్రాక్ లో ప్రగ్యా గుభాళింపు మామూలుగా లేదు. సొగసైన భంగిమలో అమ్మడు హొయలు పోయిన తీరు కుర్రాళ్లలో సెగలు పుట్టిస్తుంది. ప్రగ్యా ముస్తాబైన విధానం..స్కిన్ టోన్ ప్రతీది అమ్మడిని మరింత అందంగా తీర్చిదిద్దాయి. మత్తెక్కించే చూపులతో హృదయాల్ని చిద్రం చేసేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ప్రగ్యా అందానికి అభిమానులంతా ఫిదా అవుతున్నారు. బ్యూటీని ఉద్దేశించి హాట్ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇక సినిమాల సంగతి చూస్తే అమ్మడు హిందీలో` ఖేల్ ఖేల్ మోయిన్` అనే చిత్రంలో నటిస్తోంది. చేతిలో ఉన్నది ఈ ఒక్క చిత్రమే. కొత్త అవకాశాల కోసం అక్కడే సీరియస్ గా ట్రై చేస్తుందని సమాచారం. బాలీవుడ్ లో అమ్మడు ఇప్పటివరకూ ఒకే ఒక్క చిత్రం చేసింది. అదీ కెరీర్ ఆరంభంలో. ఆ తర్వాత ఇతర భాషల్లోనే బిజీ అయింది. మళ్లీ ఇప్పుడు బాలీవుడ్ కే వెళ్లింది.

# ప్రైమ్ వీడియో 70కు పైగా సిరీస్‌లు



ప్రైమ్ వీడియో, భారతదేశం అత్యంత ఇష్టపడే వినోద గమ్యస్థానం, ఈ రోజు తన రెండవ ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ ఇండియా షోకేస్‌లో దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మరియు విభిన్నమైన కంటెంట్ స్లేట్‌ను ఆవిష్కరించింది, దాదాపు 70 సిరీస్‌లు మరియు చలనచిత్రాలు ఉన్నాయి, వాటిలో ఎక్కువ భాగం ఈ సేవలో తదుపరి 2 సంవత్సరాలు ప్రీమియర్ అవుతాయి. 40 ఒరిజినల్ సిరీస్‌లు మరియు చలనచిత్రాలు మరియు 29 భారతదేశంలోని అతిపెద్ద మరియు అత్యంత అంచనాలు ఉన్న చలనచిత్రాలలో కొన్నింటితో, కొత్త స్లేట్ కస్టమర్‌లను ఆహ్లాదపరిచేందుకు మరియు నిమగ్నమవ్వడానికి అత్యుత్తమ భారతీయ వినోదాన్ని అందజేస్తుందని హామీ ఇచ్చింది. ప్రైమ్ వీడియో రాబోయే ఒరిజినల్‌లు ఇంటిలోని ప్రతి ఒక్కరికీ ఏదో ఒకదానిని అందిస్తాయి, ఇందులో హిందీ, తమిళం మరియు తెలుగులో అనేక రకాలైన అనేక రకాల సిరీస్‌లు మరియు చలనచిత్రాలు ఉన్నాయి. ఉత్కంఠభరితమైన థ్రిల్లర్‌లు మరియు ఆకట్టుకునే డ్రామాల నుండి పక్కటెముకలను కదిలించే కామెడీలు మరియు వెన్నెముకను చిలికిపోయే భయానక, చమత్కారమైన స్క్రిప్ట్ లేని షోలు, యువకులకు మనోహరమైన కథనాలు, హై-ఆక్టేన్ యాక్షన్ మరియు ఆకట్టుకునే సంగీత నాటకాల వరకు, విభిన్నమైన స్లేట్ ఉత్తమ స్థానిక కథలను తెరపైకి తెస్తుంది. ఇది భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫిల్మ్ స్టూడియోలలోని కొన్ని భాషల సినిమాలకు అదనం. ప్రైమ్ విడియో, ఇండియా దేశ డైరెక్టర్ మాట్లాడుతూ, "ప్రైమ్ వీడియోలో, ఫార్మాట్‌లలో అత్యుత్తమ వినోదంతో భారతీయ వినియోగదారులకు అద్భుతమైన సేవలు అందించడంపై మా దృష్టి పెట్టాము. అయోమయానికి గురిచేసే ఒరిజినల్ సిరీస్‌లు మరియు చలనచిత్రాలు, డైరెక్ట్-టు-సర్వీస్ ప్రీమియర్‌ల నుండి భాషల అంతటా కొన్ని అతిపెద్ద హిట్‌ల పోస్ట్ థియేట్రికల్ లాంచ్‌ల వరకు, ప్రతి కస్టమర్‌కు వినోదం యొక్క మొదటి ఎంపికగా ఉండటమే మా లక్ష్యం," అని అన్నారు.

# లైన్ మ్యాన్'.. నటుడిగా నాకు ఎప్పటికీ ప్రత్యేకమే : హీరో త్రిగుణ్



తెలుగు, తమిళ సినిమాల్లో విభిన్నమైన సినిమాలు చేస్తూ తనదైన ప్రత్యేకతను సంపాదించుకున్న హీరో త్రిగుణ్. ఇప్పుడీ హీరో 'లైన్ మ్యాన్' చిత్రంతో కన్నడ సినీ ఇండస్ట్రీలోనూ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వటానికి సిద్ధమయ్యారు. వి.రఘుశాస్త్రి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా కన్నడ, తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతుండటం విశేషం. ప్రెస్టీజియస్ పర్పల్ రాక్ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి ప్రచూర.పి, కాద్రి మణికాంత్, జ్యోతి రఘుశాస్త్రి, భళా స్టూడియో సహ నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. మార్చి 22న 'లైన్ మ్యాన్' చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో త్రిగుణ్ సినిమా గురించి మాట్లాడుతూ 'లైన్ మ్యాన్' సినిమా కథతో పాటు మరో రెండు కథలను కూడా నిర్మాతలు నాకు పంపారు. అయితే ఆ మూడింటిలో నాకు లైన్ మ్యాన్ కథే బాగా నచ్చింది. ఫన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటూనే మంచి మెసేజ్‌ను కూడా సినిమా ఇస్తుంది. అది కూడా మన ప్రకృతికి సంబంధించిన విషయం కావటంతో నాకు కనెక్ట్ అయ్యింది. నేను ఈ కథను సెలక్ట్ చేసుకున్నాను. నటుడిగా 23 సినిమాలు చేశాను. అయితే 'లైన్ మ్యాన్' సినిమా ఓ ప్రత్యేకమైన చిత్రంగా నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమా చేయటంపై గర్వంగా కూడా అనిపించింది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయనటువంటి లైన్ మ్యాన్ కథతో సినిమా అనేది అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను కలిగించే విషయమే. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓ గంటపాటు కరెంట్ పోతే మనమెంత బాధపడతామో తెలుసు. అలాంటిది ఓ గ్రామంలో పదిరోజుల పాటు కరెంట్ లేకుండా పోతే అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయనేది సినిమా. అయితే అన్నిరోజుల పాటు గ్రామంలో కరెంట్ ను లైన్ మ్యాన్ ఎందుకు తీసేశాడనేది సినిమా. చిన్న హార్ట్ టచింగ్ మూమెంట్ ఉంటుంది. డైరెక్టర్ రఘుశాస్త్రిగారు మంచి రైటర్. ఆయనతో ఉన్న అనుబంధంతో పాటు చెప్పిన పాయింట్ నచ్చటంతోనే లైన్ మ్యాన్ సినిమా చేయటానికి ఒప్పుకున్నాను. రఘుశాస్త్రిగారు సినిమాను చక్కగా తెరకెక్కించారు. మనం మన పల్లెటూర్లో ఉన్నట్లే నేచురల్ గా మాట్లాడుతున్నట్లే అనిపిస్తుంది.